
E KABURU - Digital News Paper E-PAPER

# ఈ-కబురు

@ekaburu.com


ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

హైదరాబాద్ (తేదీ) 14-01-2026 (వారం) బుధవారం సంపుటి: 02 || సంచిక: 14|| పేజీలు–6 www.ekaburu.com



పంచాయతీల్లో సంక్రాంతి సంబురం.. రూ.277 కోట్ల నిధులు విడుదల చేసిన ప్రభుత్వం » 3లో

ట్రోల్స్ తాత్కాలికం.. పరుగులు.. వికెట్లే శాశ్వతం » 6లో



టాటా పంచ్ ఫేస్‌లిఫ్ట్ విడుదల.. ధర ₹5.59 లక్షల నుంచి » 4లో



పీఆర్ గేమ్'.. మరో స్థాయికి వెళ్లిపోయింది: తాప్సీ » 5లో



మూలధన వ్యయం నిధుల వినియోగంలో ఏపీ స్థానం ఎంతంటే..



» 4లో

## ట్రంప్ 'ఇరాన్' సుంకం

- ఆ దేశంతో వ్యాపారం చేస్తే 25% మోత
- భారత్ సహా పలు దేశాలపై ప్రభావం
- తీవ్రంగా స్పందించిన ఖమేనీ
- మన వ్యాపారం తక్కువే: భారత్

3లో




## కుక్కకాట్లకు భారీ పరిహారం

- బాధితులకు చెల్లించాలని ఆదేశిస్తాం: సుప్రీంకోర్టు
- ఐదేళ్లలో రాష్ట్రాల చర్యలు నామమాత్రమని వ్యాఖ్య

ఈ-కబురు, ఢిల్లీ: కుక్కకాటు బాధితులకు భారీ పరిహారం చెల్లించాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశిస్తామని సుప్రీంకోర్టు తెలిపింది. కుక్కకాటు ఘటనల్లో వాటి ప్రేమికుల్ని, వాటికి ఆహారం పెట్టేవారిని కూడా జవాబుదారీగా చేస్తామని జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్ ఎన్.వి.

తరువాయి 2లో



# అంతులేని దోపిడీ!



- వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్లలో తవ్వినకొద్దీ వెలుగులోకి అక్రమాలు
- ఆడిట్‌లో రెండు రకాల లావాదేవీల్లో తేడాల గుర్తింపు!
- ఆయా లావాదేవీలపై తహసీల్దార్ల వివరణ కోరిన
- ఉన్నతాధికారులు... వాటిల్లో దోపిడీ జరిగినట్లు తేలితే స్కామ్ విలువ రూ. వందల కోట్లలోనే..
- సీసీఎల్ఏలో పనిచేస్తున్న వారి అండతోనే ఈ బాగోతం?
- అధికారుల నిర్లక్ష్యం, సాంకేతికత దుర్వినియోగం,సిబ్బంది కుమ్మక్కు కోణంలో దర్యాప్తు
- చలాన్లను ఎడిట్ చేయకపోతే కచ్చితంగా హ్యాక్ చేసి ఉంటారనే అనుమానం

ఈ-కబురు, హైదరాబాద్: వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్ల విషయంలో జరుగుతున్న అక్రమాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. చలాన్ల ఎడిటింగ్ ద్వారా రూ. 50 కోట్ల ప్రభుత్వ సొమ్మును పక్కదారి పట్టించిన వ్యవహారంపై జరుగుతున్న దర్యాప్తులో మరిన్ని విస్మయకర అంశాలు వెలుగులోకి వస్తున్నాయి. జనగామ, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్–మల్కాజిగిరి తదితర జిల్లాల్లో జరిగిన ఈ కుంభకోణంపై ఆరా తీసేందుకు రెవెన్యూ శాఖ ఉన్నతాధికారులు రాష్ట్రవ్యాప్తంగా తాజాగా నిర్వహించిన ఆడిట్‌లో రెండు రకాల ప్రధాన లావాదేవీల్లో తేడాలు గుర్తించినట్లు తెలుస్తోంది.

తరువాయి 2లో

## ఇరాన్‌లో మారణహోమం.. వేలాది మంది మృతి?



- రావణకాష్టంగా ఇరాన్
- ప్రభుత్వ వ్యతిరేక ఆందోళనల్లో 2,003కు పెరిగిన మరణాల సంఖ్య
- పలు బ్యాంక్‌లు, దుకాణాలు దగ్ధం
- ఇంటర్నెట్, ఆన్‌లైన్, మొబైల్ సేవలు బంద్

దుబాయ్/వాషింగ్టన్: ఇరాన్‌లో అనూహ్యంగా పెరిగిన ధరలు, నిరుద్యోగం, ప్రభుత్వ అసమర్థ పాలనతో విసిగిపోయిన జనం నుంచి పెల్లుబికిన ఆగ్రహాగ్ని రోజురోజుకూ మరింతగా విస్తరిస్తోంది. జనం అసంఖ్యాకంగా వీధుల్లోకి వచ్చి ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేస్తూ వాణిజ్య సము దాయాలు, బ్యాంక్‌లు, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ వాహనాలు, ఏటీఎంలకు నిప్పు పెడుతున్నారు. ఉద్యమ వార్తలు, పుకార్ల వ్యాప్తిని అడ్డుకునేందుకు అయతొల్లా అలీ ఖమేనీ సారథ్యంలోని ఇరాన్ ప్రభుత్వం దేశవ్యాప్తంగా ఇంటర్నెట్, మొబైల్ సేవలను స్తంభింపజేసింది. అయితే నాలుగు రోజుల తర్వాత కొందరికి మాత్రం అంతర్జాతీయ ఫోన్‌కాల్ సౌకర్యం అందుబాటులోకి వచ్చింది. దీంతో గత రెండు వారాలుగా తాము పడుతున్న బాధలు, నరకయాతనను పలువురు విదేశాల్లోని తమ బంధువుల ముందు ఏకరవు పెట్టారు.

తరువాయి 2లో

## పతంగుల తయారీతో ఉపాధి కల్పన

- అంతర్జాతీయ కైట్స్ ఫెస్టివల్‌ను ప్రారంభించిన మంత్రి జూపల్లి

ఈ-కబురు, హైదరాబాద్: తెలంగాణ ప్రజలు రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాలను సందర్శించడం వల్ల పేదలు, కళాకారులు, నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. రాష్ట్ర భాషా సాంస్కృతిక, పర్యాటక శాఖల ఆధ్వర్యంలో సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో మూడు రోజులపాటు నిర్వహించనున్న

తరువాయి 2లో



రైలు టికెట్ ధరల నిర్ణయం వ్యాపార రహస్యమే' 3లో





## మానవాళికి పెద్ద ముప్పు ఏఎంఆర్

ఈ-కబురు, అహ్మదాబాద్: యాంటీ మైక్రోబయల్ రెసిస్టెన్స్(ఏఎంఆర్) మానవాళికి అతిపెద్ద ముప్పు అని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా వ్యాఖ్యానించారు.

2లో

## జలవివాదాలపై దుష్ప్రచారాన్ని తిప్పికొట్టండి

- ఆధారాలతో సహా వాస్తవాలను వెల్లడించండి
- మన సర్కారు వచ్చాకే వివాదాలపై చురుగ్గా స్పందిస్తున్న విషయాన్ని ప్రజలకు తెలపండి
- తుమ్మిడిహెట్టి డీపీఆర్‌ను సిద్ధం చేయండి.. ప్రాధాన్య ప్రాజెక్టులకు భూమిని సేకరించండి
- ఆ తర్వాతే సవరణ అంచనాలు పంపండి.. కాళేశ్వరంలో కీలక పనులు పూర్తి చేయండి
- నీటిపారుదల శాఖపై సమీక్షలో అధికారులతో సీఎం రేవంత్‌రెడ్డి

ఈ-కబురు, హైదరాబాద్: జలవివాదాలపై జరుగుతున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. కృష్ణా, గోదావరి జలాలకు సంబంధించి నెలకొన్న వివాదాలపై వాస్తవాలను ప్రజలకు తెలియజేయాలన్నారు. ఎప్పటికప్పుడు ఆధారాలతో సహా వివరించాలని చెప్పారు.



తరువాయి 2లో

## తిరిగిరాని లోకాలకు మన రాజకుమారి



- రాణి ఇందిరాదేవి ధన్‌రాజ్‌గిర్ కన్నుమూత
- ప్రసిద్ధ కవి గుంటూరు శేషేంద్ర జీవన సహచరి
- దక్షిణాదిలోనే ఒకనాటి సంపన్న కుటుంబాల్లో ధన్‌రాజ్‌గిర్ ఒకటి
- 1973లో నోబెల్‌కు నామినేట్

ఈ-కబురు, హైదరాబాద్, : దక్షిణాదిలోనే అత్యంత సంపన్న కుటుంబాల్లో ఒకరైన ధన్‌రాజ్‌గిర్ వారసురాలు, ప్రఖ్యాత హిందీ, ఆంగ్ల కవయిత్రి, ప్రసిద్ధ కవి గుంటూరు శేషేంద్ర శర్మ జీవన సహచరి రాజకుమారి ఇందిరాదేవి ధన్‌రాజ్‌గిర్ (96) ఇకలేరు. కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె మంగళవారం సాయంత్రం 5.30 గంటలకు జ్ఞాన్ బాగ్ ప్యాలెస్‌లో తుదిశ్వాస విడిచారు. 1930, ఆగస్టు17న నిజాం సంస్థాన సలహాదారుడు రాజా ధన్‌రాజ్‌గిర్, రాణి ప్రమీలా దేవిలకు ముంబైలో ఇందిరా దేవి జన్మించారు.చిన్నతనంలోనే హైదరాబాద్‌కు వచ్చారు.

తరువాయి 3లో



## వ్యక్తిత్వ హనన కథనాలపై సిట్

- సజ్జనార్ పర్యవేక్షణలో 8 మందితో ఏర్పాటు.. డీజీపీ శివధర్‌రెడ్డి ఆదేశాలు
- ఓ అసత్య కథనానికి సీఎం రేవంత్ మార్ఫింగ్
- ఫొటోను జతచేయడంపై నారాయణపేటలో కేసు
- మహిళా ఐఏఎస్ అధికారిపై వచ్చిన కథనాలపై
- జయేశ్ రంజన్ ఫిర్యాదుతో హైదరాబాద్‌లో కేసు
- ఈ రెండు ఫిర్యాదుల ఆధారంగా సిట్ ఏర్పాటు
- అసత్య ప్రచారం వెనుక ఉన్న రిపోర్టర్, ఎడిటర్,
- సంస్థ యాజమాన్యం గుర్తింపునకు దర్యాప్తు

ఈ-కబురు, హైదరాబాద్, : మహిళా ఐఏఎస్ అధికారి వ్యక్తిత్వ హననం, సీఎం రేవంత్ రెడ్డి ఫొటోల మార్ఫింగ్ కేసుల విచారణకు సంబంధించి హైదరాబాద్ సీపీ సజ్జనార్ పర్యవేక్షణలో 8 మంది సభ్యులతో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని(సిట్)

తరువాయి 3లో



# ఇరాన్‌లో మారణహోమం.. వేలాది మంది మృతి?

సెంట్రల్ టెహ్రాన్‌లో కనీవినీ ఎరుగని రీతిలో పోలీసులు మొహరించారని దుబాయ్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లోని బంధువులకు చెప్పారు.ఆన్‌లైన్ సదుపాయం లేక బ్యాంక్‌లలో నగదు లావాదేవీలకు తీవ్ర ఆటంకం ఏర్పడుతుండటంతో జనాలకు కరెన్సీ కష్టాలు మొదలయ్యాయి. ఉద్యమకారులను పోలీసులు ఉక్కుపాదంతో అణచివేస్తూ కాల్పులు జరుపుతుండటంతో ఉద్యమసంబంధ ఘటనల్లో ఇప్పటిదాకా 2,003 మంది ప్రాణాలు కోల్పోయినట్లు అమెరికా కేంద్రంగా పనిచేస్తున్న 'హ్యూమన్ రైట్స్ యాక్టివిస్ట్స్ న్యూస్ ఏజెన్సీ' మంగళవారం ప్రకటించింది. వీరిలో 1,850 మంది ఉద్యమకారులుకాగా 135 మంది పోలీసులు ఉన్నారు. అభంశుభం తెలియని 9 మంది చిన్నారులు, ఉద్యమంలో పాల్గొనని 9 మంది సాధారణ జనం సైతం కాల్పుల్లో కన్నుమూశారు. మరోవైపు అమెరికా ఏ క్షణంలోనైనా దాడి చేస్తే ఇరాన్ సైతం ప్రతిదాడులకు దిగడం ఖాయమన్న అంచనాలతో ఇరానియన్లు ప్రాణభయంతో బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు.ఉధృతంగా కొనసాగుతున్న ఆందోళనల ధాటికి దుకాణాలు మూతబడుతున్నాయి. నిరంకుశ, ఛాందసవాద ఖమేనీ గద్దె దిగి ప్రజాస్వామ్యయుత పాలన కావాలంటూ వేలాదిగా జనం వీధుల్లో నిరసనోద్యమాన్ని మరింత ఉధృతం చేస్తున్నారు. పరిస్థితి అదుపు తప్పుతోందని భావించిన ఖమేనీ సర్కార్ పోలీసులను రంగంలోకి దింపి లాఠీచార్జ్, బాష్పవాయుగోళాల ప్రయోగం, తప్పనిసరి పరిస్థితుల్లో తుపాకులకు పనిచెప్తోంది. పోలీసులు, ఉద్యమకారులకు మధ్య ఘర్షణల్లో వేలాది మంది గాయపడ్డారు. గత రెండువారాల వ్యవధిలో 10,700 మందికిపైగా నిరసనకారులను ప్రభుత్వం అరెస్ట్‌చేసింది.

**ఉద్యమకారుడు ఇర్ఫాన్‌ను ఉరితీస్తాం..**

సుప్రీంకమాండర్ ఖమేనీని దూషిస్తూ గత గురువారం జరిగిన నిరసన ర్యాలీలో పాల్గొన్న నేరానికి 26 ఏళ్ల ఉద్యమకారుడు ఇర్ఫాన్ సొల్తానీని బుధవారం ఉరితీస్తామని ఖమేనీ ప్రభుత్వం మంగళవారం ప్రకటించింది. అన్యాయంగా ఇర్ఫాన్‌ను ప్రభుత్వం బలితీసుకుంటోందని, అంతర్జాతీయ సమాజం ఈ దారుణాన్ని అడ్డుకోవాలని 'హెంగ్వా ఆర్గనైజేషన్ ఫర్ హ్యూమన్ రైట్స్' సంస్థ ఆందోళన వ్యక్తంచేసింది. టెహ్రాన్ శివారు కరాజ్‌లోని ఫర్దీస్ ప్రాంతానికి చెందిన ఇర్ఫాన్‌ను జనవరి 8వ తేదీన పోలీసులు అరెస్ట్‌చేశారు. దేవునిపై యుద్ధం ప్రకటించాడని ఇర్ఫాన్‌పై నేరాభియోగాలు మోపి ఏకపక్షంగా నిర్ణయం తీసుకున్నారు. దీనిపై ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎక్కువైంది. ఒక పౌరుడి ప్రాణాలు తీసేందుకు ఖమేనీ ప్రభుత్వం నిర్ణయాలు తీసు కుని ఆగమేఘాల మీద అమలు చేయడం జీవితంలో ఎప్పుడూ చూడలేదని టెహ్రాన్‌వాసులు అసహనం వ్యక్తంచేశారు. ఇర్ఫాన్‌ను చివరిసారిగా కలిసేందుకు 11వ తేదీన కుటుంబసభ్యులకు అనుమతి ఇచ్చారు. ఇర్ఫాన్ సోదరి స్వయంగా న్యాయవాది అయినా కూడా ఆమె ఈ కేసు వాదించకుండా ప్రభుత్వం అడ్డుకుంది. మరోవైపు ఇరాన్‌లో ఉంటున్న తమ పౌరులు తక్షణం ఆ దేశాన్ని వీడాలని అమెరికా మంగళవారం ఒక అడ్వైజరీని జారీచేసింది.

**నేనున్నా.. రెచ్చిపోండి: ట్రంప్**

ఆందోళనలను మరింత రెచ్చగొట్టేలా ట్రంప్ మాట్లాడారు. ఈ మేరకు 'ట్రూత్ సోషల్'లో ఒక పోస్ట్ పెట్టారు. ''ఇరానియన్లు దేశభక్తులు. నిరసనోద్యమాన్ని మరింత ఉధృతం చేయండి. రాజ్యాంగబద్ధ సంస్థలను మీ వశం చేసుకోండి. హంతకులు, దాడులు చేసే వారి పేర్లను రాసిపెట్టుకోండి. మనందరం కలిసి వాళ్ల అంతుచూద్దాం. దాడులకు వాళ్లు భారీ మూల్యం చెల్లించుకోక తప్పదు. దారుణ హత్యోదంతాలు ఆగేదాకా ఇరాన్ ప్రభుత్వంతో నేను ఎలాంటి చర్చలు జరపబోను. అందుకే ఇరాన్ అత్యున్నతాధికారులతో అన్నిరకాల సమావేశాలను మంగళవారం రద్దు చేసుకున్నా. మీకు సాయం చేయబోతున్నాం. త్వరలోనే మీకు మా సాయం అందుతుంది. మేక్ ఇరాన్ గ్రేట్ ఎగేన్'' అని ట్రంప్ రాసుకొచ్చారు. అయితే సాయం ఏ రూపంలో చేయబోతున్నారో ట్రంప్ వెల్లడించలేదు. అయితే అమెరికా రాయబారి స్టీవ్ విట్కాఫ్‌తో ఫోన్‌లో మంతనాలు జరుపుతున్నట్లు ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ చెప్పారు.



# మానవాళికి పెద్ద ముప్పు ఏఎంఆర్



రోజురోజుకు అధికమవుతున్న ఈ సవాలును ఎదుర్కొనేందుకు అనుగుణంగా నిర్దిష్ట ప్రణాళికను తయారుచేయాలని నిపుణులను ఆయన కోరారు. గుజరాత్‌లోని గాంధీనగర్‌లో ఉన్న బయోటెక్నాలజీ పరిశోధనా కేంద్రానికి చెందిన బయోకంటైన్మెంట్ ఫెసిలిటీ-బీఎస్ఎల్ 4కు మంగళవారం శంకుస్థాపన చేసిన ఆయన ఈ మేరకు మాట్లాడారు. ఔషధాలపై ప్రజల్లో అవగాహన అవసరమని అమిత్‌షా నొక్కిచెప్పారు.

"ఏఎంఆర్ అనేది యాంటీబయోటిక్స్‌కు వ్యతిరేకంగా అభివృద్ధి చెందిన నిరోధకత. ఈ విజ్ఞానశాస్త్రాన్ని మరింత కచ్చితం, దృఢంగా చేసేందుకు పరిశోధనలు అవసరం. గర్భిణుల్లో ఏఎంఆర్ తల్లి నుంచి బిడ్డకు వ్యాపిస్తుంది. దీనిని అరికట్టేందుకు నిర్దిష్ట ప్రణాళిక అవసరం. అంటువ్యాధులను నివారించడం, భవిష్యత్తు తరాలను ఏఎంఆర్ నుంచి రక్షించడం మన లక్ష్యం. యాంటీ బయోటిక్స్‌పై కోర్సును పూర్తి చేయకపోవడం, వీటిపై అవగాహన లేకుండా వైద్యులు మందులు సిఫార్సు చేయడం. డాక్టర్ సూచనలు లేకుండా విపరీతంగా యాంటీ బయోటిక్స్‌ను వాడటం వంటివి ఈ పెనుముప్పుకు ప్రధాన కారణాలు. వీటిపై ఏఎంఆర్ అనేది వ్యక్తులకే కాదు, మొత్తం సమాజానికి తీవ్ర ముప్పు. ఇది పుణెలోని వైరాలజీ ల్యాబ్ తర్వాత రెండో అతిపెద్ద, రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేస్తున్న మొట్టమొదటి ల్యాబొరేటరీ" అని అమిత్ షా వ్యాఖ్యానించారు.

# అంతులేని దోపిడీ!

మొదటి పేజీ తరువాయి

ఒకే రిజిస్ట్రేషన్ కోసం రెండు చలాన్లు కట్టే వెసులుబాటు ఉండటంతో తక్కువ మొత్తంలో కట్టిన చలాన్‌ను ప్రభుత్వానికి చెల్లించి ఎక్కువ మొత్తంలో కట్టిన చలాన్‌ను వ్యక్తిగత బ్యాంకు ఖాతాల్లోకి మరల్చుకున్నారని ఆడిట్‌లో తేలినట్లు సమాచారం. అలాగే సేల్‌డీడ్‌ల రిజిస్ట్రేషన్ తర్వాత వాటిని రద్దు చేసుకున్నట్లు చూపి క్యాన్సిలేషన్ ఫీజు కింద రూ. 2 వేలు చెల్లించి అంతకుముందు చేసుకున్న రిజిస్ట్రేషన్‌ను కొనసాగిస్తున్నారా అనే సందేహం కూడా ఈ పరిశీలనలో తలెత్తింది.

అయితే ఈ రెండు అంశాల్లో ఏ మేరకు ఏం జరిగిందన్న దానిపై ఉన్నతాధికారులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ఈ రెండు అంశాల్లో తేడాలున్న లావాదేవీల వివరాలను తహసీల్దార్లకు పంపి వివరణ కోరారు. ఒకవేళ తాజా ఆడిట్‌లో తేలిన ఈ రెండు అంశాల్లోనూ దోపిడీ జరిగినట్లు తేలితే వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్ల కుంభకోణం విలువ రూ. వందల కోట్లలో ఉంటుందని రెవెన్యూ శాఖ వర్గాలు అంటున్నాయి.

**నాలుగు స్థానాలు... మూడు కోణాలు**

తాజా కుంభకోణం వెనుక నాలుగు స్థానాల్లో పనిచేసే సిబ్బంది, అధికారులపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మీ-సేవా కేంద్రాల నిర్వాహకులు, పోర్టల్ ఆపరేటర్లు, సీసీఎల్‌ఏ సిబ్బంది పాత్రతోపాటు తహసీల్దార్ల నిర్లక్ష్యం వల్లే అక్రమాలు జరిగాయని ప్రాథమికంగా నిర్ధారణ అయింది.

ఈ నేపథ్యంలోనే రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం, సాంకేతిక పరిజ్ఞాన దుర్వినియోగం, సిబ్బంది కుమ్మక్కు అనే మూడు కోణాల్లో దర్యాప్తు వేగవంతమవుతోందని..స్కామ్ జరిగి ఉండొచ్చని అనుమానిస్తున్న జనగామ, యాదాద్రి, రంగారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలతోపాటు మిగిలిన చోట్ల జరిగిన లావాదేవీలపైనా దర్యాప్తు జరుపుతున్నామని ప్రభుత్వం నియమించిన విచారణ కమిటీ వర్గాలు చెబుతున్నాయి.

మరో 4-5 రోజుల్లో అన్ని అంశాలు కొలిక్కి వస్తాయని అంటున్నాయి. అయితే చలాన్ల ఎడిటింగ్ ద్వారానే అక్రమాలు జరిగాయన్నది ఉన్నతాధికారుల ప్రాథమిక అభిప్రాయమైనప్పటికీ అలా జరిగి ఉండకపోతే మాత్రం ఏకంగా పోర్టల్‌ను హ్యాక్ చేసి ప్రభుత్వ సొమ్మును కాజేసి ఉండొచ్చని అనుమానిస్తున్నారు. ఈ కోణంలోనూ దర్యాప్తు జరుగుతున్నట్లు తెలుస్తోంది.

**ఒక చలాన్... ఎనిమిది ప్రశ్నలు**

**1 ఇష్టారాజ్యంగా స్లాట్‌ల బుకింగ్‌కు అనుమతి ఎలా?**

గతంలో ధరణి, ప్రస్తుత భూభారతి పోర్టల్ ద్వారా ఎవరు ఎక్కడి నుంచైనా స్లాట్ బుక్ చేసుకునే అవకాశం కల్పించడమే ఈ కుంభకోణానికి ప్రధాన కారణమని తెలుస్తోంది. క్రయ, విక్రయదారులతో సంబంధం లేని ఫోన్ నంబర్లతో స్లాట్‌లు బుక్ చేసి, ఆ స్లాట్ ఐడీల ఆధారంగానే దోపిడీకి పాల్పడినట్లు తెలుస్తోంది. ఒకే ఫోన్ నంబర్‌పై 70 నుంచి 100 వరకు స్లాట్‌లను బుక్ చేసినట్లు సమాచారం.

**2 ఆ ఉద్యోగులనే ఎందుకు కొనసాగించారు?**

ధరణి పోర్టల్‌ను టెర్రాసిస్ అనే ప్రైవేట్ సంస్థ నిర్వహించగా భూభారతి పోర్టల్‌ను ఎన్‌ఐసీకి అప్పగించారు. అయితే అప్పుడు, ఇప్పుడు పని చేస్తున్న ఉద్యోగుల్లో 90 శాతం మంది వారే కావడం కూడా ఈ అక్రమాలు కొనసాగేందుకు ఊతమిచ్చిందన్న చర్చ నడుస్తోంది. వేతనాలు తక్కువగా ఉండే పోర్టల్ ఆపరేటర్లలో 60 శాతం మంది వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్ల కోసం స్లాట్‌లు బుక్ చేసి అదనపు ఆదాయం పొందుతుండటంతో మీ-సేవా కేంద్రాల నిర్వాహకులతోపాటు ఆపరేటర్ల పాత్రపైనా దర్యాప్తు జరుగుతోంది.

**3 ఎడిట్ చేశారా.. హ్యాక్ చేశారా?**

స్లాట్ బుకింగ్ కోసం రిజిస్ట్రేషన్ ఫీజును చెల్లించేటప్పుడే చలాన్లను ఎడిట్ చేసినట్లు అధికారులు ప్రాథమిక అవగాహనకు వచ్చారు. మీ-సేవా నిర్వాహకులు లేదా ఆపరేటర్లు కట్టిన చలాన్‌లను సీసీఎల్‌ఏ కార్యాలయ సర్వర్ వద్ద ఉండే సిబ్బంది ఎడిట్ చేస్తేనే ఇది సాధ్యమవుతుందని అధికారులు చెబుతున్నారు. అలా జరగాలంటే మీ-సేవా, ధరణి ఆపరేటర్లు, సీసీఎల్‌ఏ సిబ్బంది కుమ్మక్కు కావాల్సి ఉంటుందని.. అది సాధ్యం కాదనుకుంటే చలాన్ దోపిడీ జరిగినప్పుడల్లా రిజిస్ట్రేషన్ పోర్టల్‌నే హ్యాక్ చేసి ఉంటారనే చర్చ జరుగుతోంది.

**4 తహసీల్దార్లు ఏం చేస్తున్నట్లు?**

అసిస్టెంట్ సబ్‌రిజిస్ట్రార్ హోదాలో ఉండే తహసీల్దార్లకు కేవలం భూమి వివరాలు, క్రయ, విక్రయదారుల వ్యక్తిగత వివరాలు సరిచూసుకునే బాధ్యత తప్ప ప్రభుత్వానికి అందాల్సిన మొత్తాన్ని చెక్ చేసే వ్యవస్థ వారి వద్ద లేదని.. ధరణి పోర్టల్ నుంచే ఇది కొనసాగుతున్నప్పటికీ భూభారతి అమల్లోకి వచ్చినా కూడా దీన్ని మార్చలేదని తెలుస్తోంది. స్లాట్ బుకింగ్ చేసిన వారు ప్రింట్ రూపంలో రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్‌కు జత చేసే చలాన్ జిరాక్స్‌ను చూసి తహసీల్దార్లు ఎలా సంతకాలు పెట్టారన్నది కూడా అనేక అనుమానాలకు తావిస్తోంది.

**5 తనిఖీ వ్యవస్థ లేదా?**

సాధారణంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లను సీనియర్ అసిస్టెంట్ హోదాలోని ఓ ఉద్యోగి చెక్ చేసి సబ్ రిజిస్ట్రార్‌కు పంపుతారు. సబ్‌రిజిస్ట్రార్ ఆయా డాక్యుమెంట్లను క్షుణ్ణంగా పరిశీలించి ఫీజు, చలాన్ అంశాలను సరిచూసుకొని రిజిస్ట్రేషన్‌కు పంపుతారు. కానీ వ్యవసాయ భూముల విషయంలో ఒకసారి స్లాట్ బుక్ అయిన డాక్యుమెంట్ నేరుగా తహశీల్దార్లకే వెళ్తోంది. రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయ్యే సమయంలో ప్రింట్ తీశాకే చలాన్ ఎంత కట్టారన్నది రివర్స్ ఎండార్స్‌మెంట్‌లో కనిపిస్తోంది.

**6 అప్పుడైనా చూడాలి కదా?**

తహసీల్దార్లు పనిఒత్తిడి వల్ల రివర్స్ ఎండార్స్‌మెంట్‌లో ఎంత చలాన్ వచ్చిందో చూడకుండా రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేశారని.. ఇది కచ్చితంగా వారి నిర్లక్ష్యమేనని దర్యాప్తు కమిటీ భావిస్తోంది. అలాగే తహసీల్దార్లకు తెలిసే ఇదంతా జరిగిందా అనే కోణంలోనూ దర్యాప్తు చేస్తోంది.

**7 ఫీజు ఎంత కడతారో తెలియదా?**

వ్యవసాయ భూములను గత ఆరేళ్లుగా రిజిస్ట్రేషన్ చేస్తున్న తహసీల్దార్లకు ఎంత భూమి రిజిస్ట్రేషన్‌కు ఎంత ఫీజు కడతారో కూడా తెలియదని.. 60 శాతం మంది తహసీల్దార్లు ఆఫీసు సిబ్బందిపైనే ఆధారపడి రిజిస్ట్రేషన్లు చేస్తున్నారని రెవెన్యూ వర్గాలే చెబుతున్నాయి. రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన ఏ డాక్యుమెంట్‌లో ఏం రాశారో కూడా వారికి అర్థమయ్యే పరిస్థితి లేదని.. ఒకవేళ అర్థమైనా అలా చూసే తీరిక లేదని అంటున్నాయి.

**8 లావాదేవీలను ఆడిట్ చేయలేదా?**

సాగు భూముల రిజిస్ట్రేషన్ లావాదేవీలకు సంబంధించి గత ఆరేళ్లలో ఒక్కసారి కూడా రాష్ట్రవ్యాప్త ఆడిట్ జరగలేదని, అలా జరిగి ఉంటే ఎక్కువగా అక్రమాలు జరిగాయని ప్రాథమికంగా తేలిన 2021, 2022లోనే ఈ కుంభకోణం వెలుగులోకి వచ్చేదని తెలుస్తోంది.

**'నాలా' ఫీజు పెంపు గురించి వారికి 8 నెలల దాకా తెలియదట!**

గతంలో ధరణి పోర్టల్ నిర్వహణ పూర్తిగా ఉన్నతాధికారుల చేతుల్లోనే ఉండేదని తహసీల్దార్లు చెబుతున్నారు. హైదరాబాద్, రంగారెడ్డి మినహా మిగిలిన జిల్లాల్లో వ్యవసాయ భూముల వినియోగ మార్పిడి (నాలా) ఫీజును 3 శాతం నుంచి 5 శాతానికి పెంచిన విషయం 7-8 నెలల వరకు తమకు తెలియలేదని వారంటున్నారు. నాలా ఫీజు కింద ఎంత భూమికి ఎంత చలానా కట్టాలో కూడా తమకు తెలిసే పరిస్థితి ఉండేది కాదని పేర్కొంటున్నారు. ఇక సాధారణ భూముల రిజిస్ట్రేషన్ల విషయంలోనూ ఫీజు ఎంత కట్టాలో, రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్‌లో ఏముందో అరకొర శిక్షణ ఇస్తే ఎలా తెలుస్తుందని ప్రశ్నిస్తున్నారు.

**ప్రభుత్వ సొమ్మును అణాపైసాతో సహా వసూలు చేస్తాం**

'ఇష్టానుసారంగా భూముల రిజిస్ట్రేషన్లు చేసేందుకే గత ప్రభుత్వం ధరణి పోర్టల్ తెచ్చింది. కనీసం చలాన్ ఎంత కట్టారో కూడా సరిచూసుకోలేని విధంగా సాంకేతికతను సమకూర్చింది. తహసీల్దార్లకు సరైన శిక్షణ ఇవ్వకపోగా ఆడిట్ వ్యవస్థకు దిక్కేలేదు. ధరణి పోర్టల్ స్థానంలో మేం తెచ్చిన భూభారతి పోర్టల్‌కు సాంకేతిక సత్తువ సమకూర్చేందుకు కొంత సమయం పడుతుంది. ఈ క్రమంలోనే ధరణి దరిద్రాలు బయటపడుతున్నాయి. ప్రభుత్వ సొమ్మును అణాపైసాతో సహా తిరిగి తీసుకుంటాం. బాధ్యులను కఠినంగా శిక్షిస్తాం'
- మంత్రి పొంగులేటి



మొదటి పేజీ తరువాయి

## పతంగుల తయారీతో ఉపాధి కల్పన



అంతర్జాతీయ కైట్స్ ఫెస్టివల్‌ను, మిఠాయిల ఉత్సవాలను మంగళవారం మంత్రి జూపల్లి.. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి ప్రారంభించారు. జూపల్లి మాట్లాడుతూ... మన సంస్కృతి, సంప్రదాయాలు మరుగున పడకుండా ఉండేందుకు ప్రజాప్రభుత్వం ఇలాంటి ఉత్సవాలను నిర్వహిస్తోందని చెప్పారు. విదేశీ కైట్ ఫ్లయర్లు వినియోగిస్తున్న వివిధ ఆకారాలు, రంగుల పతంగుల తయారీలో నగర యువతకు ఉపాధి కల్పించే దిశగా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

పతంగులను ఎగురవేస్తున్న వివిధ దేశాల ప్రతినిధులు

ఈసారి పతంగులు, మిఠాయిలతోపాటు హాట్ ఎయిర్ బెలూన్లు, డ్రోన్ల ఉత్సవాలను సైతం నిర్వహిస్తున్నామన్నారు. పరేడ్ మైదానంలో హాట్ ఎయిర్ బెలూన్ల ప్రదర్శనను తిలకించడంతోపాటు వాటిల్లో ప్రయాణించి కొత్త అనుభూతిని పొందేందుకు ప్రజలు ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవచ్చని చెప్పారు. తాను స్వయంగా 2,800 మీటర్ల ఎత్తులో సుమారు పది కిలోమీటర్లపాటు హాట్ ఎయిర్ బెలూన్‌లో ప్రయాణించనున్నట్లు తెలిపారు. గచ్చిబౌలిలో డ్రోన్ల ఉత్సవంలో భాగంగా తొలిసారిగా ఆకాశంలోనే డ్రోన్ల ఫుట్‌బాల్ పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. మంత్రి పొన్నం మాట్లాడుతూ... మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, ప్రజలందరికి మెట్రో అందుబాటులో ఉన్నందున ప్రభుత్వం నిర్వహిస్తున్న ఈ ఉత్సవాలకు వేలాదిగా తరలి రావాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ ఛైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి, పర్యాటక శాఖ ఎండీ వల్లూరి క్రాంతి, భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ ఏనుగు నర్సింహారెడ్డి, హెరిటేజ్ శాఖ డైరెక్టర్ కుతాడి అర్జున్‌రావు, క్లిక్ ప్రధాన కార్యదర్శి బెంజిమెన్, కవి యాకూబ్ తదితరులు పాల్గొన్నారు.

## జలవివాదాలపై దుష్ప్రచారాన్ని తిప్పికొట్టండి

తుమ్మిడిహెట్టి బ్యారేజీ డీపీఆర్‌ను సిద్ధం చేసే ప్రక్రియను వేగిరం చేయాలన్నారు. దీంతోపాటు కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణ కోసం కన్సల్టెంట్ల ఎంపికను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పునరుద్ధరణ డిజైన్లకు ఏయే సంస్థలు ముందుకొచ్చాయని, వాటి అర్హతలు ఏంటని ఆరా తీశారు. మంగళవారం తన నివాసంలో నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జా, సీఎం కార్యదర్శి మాణిక్కరాజ్ కన్నన్, ఈఎన్‌సీ (జనరల్) మహ్మద్ అంజద్ హుస్సేన్, మాజీ ఈఎన్‌సీ సుధాకర్‌రెడ్డితో పాటు పలువురు సీఈలతో సీఎం రేవంత్‌రెడ్డి సమావేశమయ్యారు. ప్రతిష్ఠాత్మక ఐఐటీలతో సంయుక్త భాగస్వామ్యం చే సుకునే సంస్థలకే పనులు అప్పగించనున్నామని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. తుమ్మిడిహెట్టి బ్యారేజీ డీపీఆర్‌ను మూడు నెలల్లోగా సిద్ధం చేసే బాధ్యతను కన్సల్టెన్సీ తీసుకుందని, ఆ సంస్థ డీపీఆర్ సిద్ధం చేయడానికి అవసరమైన సాంకేతిక వివరాలు సేకరిస్తోందని చెప్పారు.



# కుక్కకాట్లకు భారీ పరిహారం

అంజారియాల ధర్మాసనం హెచ్చరించింది. సంస్థల ప్రాంగణాలు, రహదారులపై వీధికుక్కల్ని తొలగించాలంటూ 2025 నవంబరు 7న ఇచ్చిన ఉత్తర్వులపై అనుకూల, ప్రతికూల వాదనల్ని వింటున్న ధర్మాసనం మంగళవారం తీర్పు వెలువరించింది. ''కుక్క కరవడం వల్ల ఏ ఒక్కరు గాయపడినా, ప్రాణాలు కోల్పోయినా.. వారు పిల్లలైనా, పెద్దలైనా మేం మాత్రం ఆయా రాష్ట్ర ప్రభుత్వాల నుంచి భారీ పరిహారం అడుగుతాం. ఎందుకంటే వీధి కుక్కలను నియంత్రించడానికి నిబంధనలు పాటించాల్సిందిగా గత ఐదేళ్లుగా మేం చెబుతున్నా దానిని అమలు చేయడంలో రాష్ట్రాలు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నాయి.

వీధికుక్కలకు ఆహారం పెట్టేవారూ ఈ ఘటనలకు బాధ్యత వహించాల్సి ఉంటుంది. మీకు ఈ జంతువులపై అంత ప్రేమ పొంగిపోతుంటే వాటిని మీ ఇళ్లకే ఎందుకు తీసుకువెళ్లకూడదు? వీధి కుక్కల సమస్య భావోద్వేగపూరిత అంశమని అంటున్నారు. మీ భావోద్వేగం కుక్కలపై మాత్రమేనా? మేం మనుషుల గురించి కూడా ఆందోళన చెందుతున్నాం. కుక్కలు మనచుట్టూ తిరుగుతూ, కరుస్తూ, భయపెట్టడమేమిటి?'' అని జస్టిస్ నాథ్ ప్రశ్నించారు. దానితో జస్టిస్ మెహతా ఏకీభవించారు. 'ఒక తొమ్మిదేళ్ల పిల్లాడిపై కుక్కలు దాడిచేస్తే ఎవరిని జవాబుదారీని చేయాలి? దానికి తిండిపెట్టిన సంస్థనా? ఈ సమస్యపై మేం కళ్లు మూసుకుని కూర్చోవాలని మీరు కోరుకుంటున్నారా?' అని ఆయన ప్రశ్నించారు.



# 'రైలు టికెట్ ధరల నిర్ణయం వ్యాపార రహస్యమే'

ఈ-కబురు, ఢిల్లీ: ప్రయాణికుల రైళ్లలో టికెట్ ధరలను నిర్ణయించే పద్ధతి వ్యాపార రహస్యం కాబట్టి దాన్ని వెల్లడించనక్కర్లేదని సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ)లోని సెక్షన్ 8 నిర్దేశిస్తోందని కేంద్ర సమాచార కమిషన్ (సీఐసీ)కి రైల్వే బోర్డు తెలిపింది. రైలు టికెట్ ధరలను నిర్ణయించే పద్ధతినీ, గిరాకీని బట్టి టికెట్ ధరలు పెంచడం, తగ్గించడం గురించీ, తత్కాల్ టికెట్ల ప్రభావం గురించీ తెలపాలంటూ వచ్చిన దరఖాస్తుపై రైల్వే బోర్డు ఈ వివరణ ఇచ్చింది. రైల్వే సమాధానాన్ని సీఐసీ ఆమోదిస్తూ దరఖాస్తును కొట్టివేసింది. అప్పీలుదారుడు విచారణకు హాజరు కాలేదనీ, ఇకపై ఈ సమస్యలో ఎటువంటి జోక్యం చేసుకోనక్కర్లేదని తీర్మానించింది.

రైళ్లలో వివిధ తరగతులు, వాటిలోని సౌకర్యాల ప్రాతిపదికగా టికెట్ ధరలను నిర్ణయిస్తామని సీఐసీకి రైల్వే బోర్డు వివరించింది. రైల్వే శాఖ వ్యాపార ప్రాతిపదికన రైళ్లను నడుపుతున్నప్పటికీ వచ్చే లాభాలను ప్రైవేటు కంపెనీల మాదిరిగా తన వద్దే అట్టిపెట్టుకోదనీ, ఆ లాభాలను సామాన్యుడికి ప్రయోజనం కలిగించడానికే తిరిగి వెచ్చిస్తామని రైల్వేబోర్డు వివరించింది. రైలు టికెట్ ధరలను నిర్ణయించే పద్ధతిని వెల్లడించనక్కర్లేదని సీఐసీ కూడా గతంలో తీర్మానించిందని గుర్తుచేసింది.



# వ్యక్తిత్వ హనన కథనాలపై సిట్



ఏర్పాటు చేస్తూ డీజీపీ శివధర్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. తెలంగాణ పబ్లిక్ టీవీ వాట్సాప్ గ్రూపులో కావలి వెంకటేశ్ అనే వ్యక్తి సీఎం రేవంత్ ఫొటోను మార్ఫింగ్ చేసి ఓ అసత్య కథనాన్ని పోస్టు చేశాడని, దీన్ని మరికొందరు షేర్ చేశారని నారాయణపేట జిల్లా మద్దూర్ పోలీసుస్టేషన్‌లో ఈ నెల 11న కాంగ్రెస్ నేత గూళ్ల నరసింహ ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు బీఎన్‌ఎస్ సెక్షన్లు 196(2),353(1)(ఏ), 352తో పాటు ఐటీ చట్టం కింద కూడా కేసు నమోదు చేశారు. ఇదే విధంగా మహిళా ఐఏఎస్ అధికారి వ్యక్తిత్వాన్ని కించపరిచే విధంగా కొన్ని టీవీ చానళ్లు, యూట్యూబర్లు కథనాలను ప్రసారం చేశారంటూ ఐఏఎస్ అధికారుల సంఘం కార్యదర్శి జయేశ్‌రంజన్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా హైదరాబాద్ సీసీఎస్ పోలీసులు బీఎన్‌ఎస్ సెక్షన్లు 75,78,79,351(1),352(2) కింద కేసు నమోదు చేశారు. ఈ వార్తా కథనాన్ని ముందుగా ప్రసారం చేసిన ఎన్‌టీవీతో పాటు తెలుగు స్క్రైబ్, ఎంఆర్ మీడియా తెలంగాణ, ప్రైమ్ 9 తెలంగాణ, పీవీ న్యూస్, సిగ్నల్ టీవీ తెలుగు, ఓల్గా టైమ్స్, మిర్రర్ టీవీ, టీ న్యూస్ తెలుగు చానళ్లపై చర్యలు తీసుకోవాలని జయేశ్ రంజన్ తన ఫిర్యాదులో కోరారు.

మరోవైపు, మహిళా ఐఏఎస్ అధికారుల పట్ల అసభ్యకర వార్తలను ప్రసారం చేయడం గర్హనీయమని సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి అన్నారు. భావ ప్రకటన స్వేచ్ఛను దుర్వినియోగం చేయకూడదని అభిప్రాయపడ్డారు. మహిళా ఐఏఎస్ అధికారి పేరును నేరుగా వెల్లడించకుండా గతంలో ఆమె పనిచేసిన మూడు పోస్టులను కథనంలో చెప్పడం ద్వారా ఆమె గుర్తింపును సులభతరం చేశారంటూ ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల సంఘాలతో పాటు రెవెన్యూ ఇతర సంఘాలు కూడా ఆగ్రహం వ్యక్తం చేసిన నేపథ్యంలో ఈ కథనాల వెనుక గుట్టు విప్పడానికి సిట్ అవసరమని ప్రభుత్వం భావించినట్లు సమాచారం. అసలు ఈ కథనాన్ని ఎవరు రూపొందించారు.. ఎందుకు ప్రసారం చేశారన్న దానిపై సిట్ దర్యాప్తు చేయనుంది. కథనానికి బాధ్యులైన రిపోర్టర్, ఎడిటర్, సంస్థ యాజమాన్యం పాత్రను గుర్తించడానికి సిట్ అధికారులు రంగంలో దిగారు. ఈ కథనం ప్రసారం వెనుక కుట్ర ఉంటే కనిపెడతామని డీజీపీ శివధర్ రెడ్డి స్పష్టం చేశారు.

**సిట్‌లో ఉన్నదెవరంటే**

సజ్జనార్ సిట్ దర్యాప్తును పర్యవేక్షిస్తారు. హైదరాబాద్ నార్త్ రేంజ్ జాయింట్ కమిషనర్ ఎన్.శ్వేత సిట్ ఇన్‌చార్జిగా ఉంటారు. చేవెళ్ల డీసీపీ యోగేశ్ గౌతం, హైదరాబాద్ అడ్మిన్ డీసీపీ వెంకటలక్ష్మి, హైదరాబాద్ సైబర్ క్రైమ్స్ డీసీపీ అరవిందబాబు, విజిలెన్స్‌లో అదనపు ఎస్పీ ప్రతాప్ కుమార్, ఈ కేసు నమోదు చేసిన సీసీఎస్ ఏసీపీ గురు రాఘవేంద్ర, కౌంటర్ ఇంటెలిజెన్స్ సెల్ ఇన్‌స్పెక్టర్ శంకర్ రెడ్డి, సైబర్ సెల్ ఎస్సై పీ.హరీశ్ సిట్‌లో సభ్యులుగా ఉన్నారు.

**విచారం వ్యక్తం చేసిన టీవీ చానల్ యాజమాన్యం**

మహిళా ఐఏఎస్‌పై కథనాన్ని ప్రచారం చేసిన అంశంపై ప్రముఖ టీవీ చానల్ యాజమాన్యం విచారం వ్యక్తం చేసింది. కథనం ప్రచారం వెనుక ఏదైన కుట్ర దాగి ఉందా అనేదానిపై నిజాలు నిగ్గు తేల్చేందుకు పోలీస్ శాఖ సిట్ ఏర్పాటు చేసిన గంటల వ్యవధిలోనే సదరు టీవీ యాజమాన్యం విచారం వ్యక్తం చేస్తూ మంగళవారం ప్రకటన విడుదల చేసింది. ''ఆ కథనం ఎవర్నీ ఉద్దేశించింది కాదు. ఏ వర్గాన్ని కించపరచాలనే ఉద్దేశం ఎంతమాత్రం లేదు. అయినప్పటికీ ప్రత్యక్షంగా కానీ, పరోక్షంగా కానీ ఈ కథనం వల్ల ఎవరి మనోభావాలైనా దెబ్బతిని ఉంటే దానికి మా విచారం వ్యక్తం చేస్తున్నాం. ఆల్ ఇండియా సర్వీసెస్ అధికారులు, ప్రజాప్రతినిధుల పట్ల మాకు గౌరవం ఉంది. జరిగిన దానికి చింతిస్తున్నాం'' అని ఆ టీవీ చానల్ ప్రకటించింది.

# ట్రంప్ 'ఇరాన్' సుంకం




**ఈ-కబురు, దుబాయ్: ఇరాన్‌తో వ్యాపారం చేసే దేశాలపై 25శాతం అదనంగా సుంకాలను విధిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. అది వెంటనే అమల్లోకి వస్తుందని ఆయన స్పష్టం చేశారు. భారత్‌తోపాటు బ్రెజిల్, చైనా, రష్యా, తుర్కియే, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) దేశాలు ఇరాన్‌తో వ్యాపారం చేస్తున్నాయి. ఇరాన్‌తో చర్చలకు రంగం సిద్ధమవుతోందని, అయినా అక్కడి ఆందోళనల్లో వందల మంది మరణించడంతో ఆంక్షలను అమల్లోకి తేవాల్సి వస్తోందని ట్రంప్ తెలిపారు. ఇరాన్‌తో వ్యాపారం చేసే అన్ని దేశాలపై 25 శాతం సుంకాలు విధిస్తున్నట్లు ట్రంప్ ప్రకటించడంపై ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ స్పందించారు. 'మా దేశం శత్రువుల ముందు తలొగ్గదని పలుమార్లు చెప్పాం. ఇప్పటికైనా అమెరికా రాజకీయ నాయకులు తమ మోసపూరిత చర్యలు ఆపాలి. మా దేశానికి ద్రోహం చేస్తున్న కిరాయి వ్యక్తులపై ఆధారపడటం మానేయాలి. ఇరాన్ బలమైన, శక్తిమంతమైన దేశం. మాకు శత్రువు గురించి తెలుసు. వారిని ఎదుర్కోవడానికి మేం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటాం' ఎక్స్ వేదికగా ఆయన స్పష్టం చేశారు.**

**అమెరికా సుంకాల హెచ్చరికలపై చైనా మండిపడింది. ప్రతీకార చర్యలు చేపడతామని హెచ్చరించింది. 'సుంకాల యుద్ధంలో విజేతలెవరూ ఉండరు. చైనా తన చట్టబద్ధ హక్కులను. ప్రయోజనాలను కాపాడుకుంటుంది' అని విదేశాంగశాఖ అధికార ప్రతినిధి మావో నింగ్ స్పష్టం చేశారు.**

**ఇరాన్‌తో భారత్‌కు వాణిజ్య, ఆర్థిక సంబంధాలు పరిమితంగానే ఉన్నాయని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.**

# తిరిగిరాని లోకాలకు మన రాజకుమారి

ఇక్కడే మెహబూబియా బాలికల పాఠశాలలో హైస్కూల్ విద్య అభ్యసించారు. అనంతరం ఆమె ఇల్లు జ్ఞాన్ బాగ్ ప్యాలెస్సే ఆమె విద్యాలయంగా మారింది. ఇక్బాల్ ప్రేరణతో చిన్న వయసులోనే సాహిత్యాభిమానిగా మారారు. తొమ్మిదో ఏటనే రచనలు రాయడం ప్రారంభించారు. ముంబై, పూణె, ఊటీ, హైదరాబాద్ నగరాల్లో వీరికి రాజ ఠీవిని ప్రతిబింబించే అందమైన ప్యాలేస్‌లున్నాయి. హైదరాబాద్ వారసత్వ కట్టడాల్లో ఒకటైన జ్ఞాన్ బాగ్ ప్యాలెస్ వీరి పూర్వీకులు యూరోపియన్ శైలిలో 1890లో నిర్మించారు. తండ్రి రాజా ధన్ రాజ్‌గిర్ సాహిత్యాభిమాని కావడంతో బాల్యం నుంచి ఆంగ్ల, హిందీ, ఉర్దూ, మరాఠా సాహితీవేత్తలతో ఆమెకు పరిచయం ఏర్పడింది.ఇది ఆమె జీవితాన్ని మలుపు తిప్పింది. ఉర్దూలో ఆమె ద్విపదులు రాశారు. ''ది అపోస్టల్ '' పేరుతో తొలి కవితా సంపుటి వెలువడింది. రిటర్న్ ఎటర్నిటీ, పోయెమ్స్ ఆఫ్ మై నేషనల్ మెమోరీ, విండ్ బ్లోస్ ఫ్రమ్ స్కా ఫోల్డ్ తదితర 12 పుస్తకాలు ఇందిరా దేవి రాశారు. తన కుటుంబ వారసత్వ చరిత్రను ''మెమోరీస్ ఆఫ్ ది దక్కన్ '' పేరుతో కాఫీటేబుల్ బుక్ గా ప్రచురించారు. వరల్డ్ పోయెట్రీ సొసైటీ ఇంటర్ కాంటినెంటల్ సంస్థ 1973లో ఇందిరా దేవిని నోబెల్ సాహిత్య పురస్కారానికి నామినేట్ చేసింది. ఇలాంటి అరుదైన గౌరవం పొందిన తొలి భారతీయ కవయిత్రి ఇందిరాదేవి కావడం విశేషం. ఆమె రాసిన కొన్ని ఆంగ్ల కవితలను ప్రముఖ కవి ముగ్ధుమ్ ఉర్దూ లోకి అనువదించారు.

**శేషేంద్రతో వివాహం**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హిందీ అకాడమీకి మొట్ట మొదటి అధ్యక్షురాలిగా ఇందిరాదేవి బాధ్యతలు నిర్వర్తించారు. ఆమె చిత్రకారిణి కూడా. ముంబైలో ఎం.ఎఫ్. హుస్సేన్ సారథ్యంలో ఇందిర గీసిన చిత్రాలతో 1970వ దశకంలో ప్రదర్శన నిర్వహించారు. శేషేంద్ర శర్మతో వివాహానంతరం కవిత్వ రచనకు విరమణ ప్రకటించారు. 'ఒకే ఇంట్లో ఇద్దరు కవులు ఉండకూడదు' అన్నది ఆమె అభిప్రాయం. శేషేంద్ర వల్ల తెలుగు సాహితీ సమాజంతో ఇందిరకు పరిచయం ఏర్పడింది. శేషేంద్ర రాసిన పది వేల ఉత్తరాలతో నాచారంలో ప్రత్యేక గ్యాలరీ ఏర్పాటు చేశారు. అందులో నాలుగు వేల పోస్టు కార్డులు ఉండడం విశేషం. గుంటూరు శేషేంద్ర శర్మ రచనలపై ఆయన సంతతికి, ఇందిరాదేవి మధ్య వివాదం నడిచింది. న్యాయపోరాటంలో ఆమెకు ప్రతికూలంగా ఫలితం వచ్చింది. మహాకవి శ్రీశ్రీ అరెస్టు సమయంలో అప్పటి ముఖ్యమంత్రి వెంగళరావుకు ఫోన్ చేసి విడుదల చేయాల్సిందిగా ఇందిర కోరినట్లు ఓ సందర్భంలో 'ఆంధ్రజ్యోతి నవ్య'తో ఆమె చెప్పారు. జాతీయ ఉర్దూ కవులతో పాటు కవి సమ్రాట్ విశ్వనాథతోనూ ఆత్మీయానుబంధం ఉంది. నిజాం సంస్థానంలో రెండుసార్లు ప్రధానిగా పని చేసిన మహా రాజా కిషన్ ప్రసాద్‌తో ఇందిర క్యారమ్స్ ఆడారు. మౌంట్ బాటెన్, సర్దార్ జఫ్రీ, ఖైఫీ అజ్మీ వంటి వారితో మంచి పరిచయం ఉండేది. ఏడో నిజాంతోనూ సంభాషించిన ఘనత ఇందిర సొంతం. ఇక్బాల్, నెహ్రూ, సర్వేపల్లి, నిజాం కుటుంబసభ్యులు ప్రిన్సెస్ ఇస్రా, దుర్రె షావర్, పైగా, సాలార్ జంగ్ వంశస్థులతో ఇందిరా దేవి మైత్రీ కొనసాగించారు. ఇందిరాదేవి ధన్ రాజ్‌గిర్ అంత్యక్రియలు బుధవారం ఉదయం అంబర్‌పేట శ్మశాన వాటికలో జరుగుతాయని మహేష్ విశ్వనాథ తెలిపారు. ఆమె తుది కోరిక మేరకు అత్యంత సాదాసీదాగా తెలుగు వైదిక సంప్రదాయం ప్రకారం కవిసామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ తమ్ముడు రాంమ్మూర్తి కుమారుడు విశ్వనాథ శోభనాద్రి చేతుల మీదగా అంతిమ సంస్కారాలు నిర్వహిచనున్నట్లు సమాచారం.



# రికార్డుస్థాయిలో ధాన్యం కొనుగోళ్లు



ఈకబురుహైదరాబాద్: సంక్రాంతి పండగ జరుపుకొంటున్న సమయంలో తెలంగాణ రాష్ట్రం చారిత్రక మైలురాయిని దాటిందని పౌర సరఫరాలశాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్ (202526) లో రాష్ట్రవ్యాప్తంగా 70.82 లక్షల టన్నుల వరి ధాన్యం కొనుగోళ్లు జరిగాయని ఆయన మంగళవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. 2020 21లో అత్యధికస్థాయిలో నమోదైన 70.2 లక్షల టన్నుల రికార్డును అధిగమించి రాష్ట్రం సరికొత్త రికార్డును సృష్టించిందనీ, దేశంలో ఏ రాష్ట్రం కూడా ఈ ఘనత సాధించలేదని వివరించారు. ఈ కొనుగోళ్లతో 13.97 లక్షల మంది రైతులు లబ్ధి పొందారని..వారికి కనీస మద్దతు ధరగా రూ.16,606 కోట్లతో పాటు బోనస్ రూపంలో రూ.1,425 కోట్లు చెల్లించామని తెలిపారు. ఇది రైతు సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యానికి నిదర్శనమని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అభివర్ణించారు.

**రెండు శాఖల సమన్వయంతోనే..**

ధాన్యం కొనుగోలు ప్రక్రియలో పౌరసరఫరాలు, నీటిపారుదల శాఖల సమన్వయం, తెలంగాణ రైతాంగ భాగస్వామ్యంతోనే ఈ రికార్డు సాధ్యమైందని మంత్రి తెలిపారు. 'వ్యవసాయ రంగం పట్ల సీఎం రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కల ఆధ్వర్యంలో ప్రభుత్వం అనుసరిస్తున్న అనుకూల విధానాలకు ధాన్యం కొనుగోళ్లు అద్దం పడుతున్నాయి. రికార్డు స్థాయిలో ధాన్యం దిగుబడి వచ్చిన నేపథ్యంలో కొనుగోలు ప్రక్రియను ప్రభుత్వం సవాల్‌గా స్వీకరించి 8,448 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది' అని ఉత్తమ్ వివరించారు.ది.

# ప్రజల దృష్టి మరల్చడానికే సిట్ ఏర్పాటు



ఈకబురు హైదరాబాద్: పాలన వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మరల్చడానికే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం సిట్ ఏర్పాటు చేసిందని భారత రాష్ట్ర సమితి రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అన్యాయాలు, అక్రమాలపై సిట్‌ను ఎందుకు ఏర్పాటు చేయడం లేదని ప్రశ్నించారు. ఓ టీవీ ఛానల్ ప్రసారం చేసిన కథనానికి.. అనేక ఇతర ఛానళ్లు, డిజిటల్ మీడియాలపై సిట్ వేయడం విడ్డూరంగా ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ అంతర్గత కుమ్ములాటలు, అక్రమాలు, అవినీతిని దాయడానికే ఇలాంటి గారడీలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.


''కాంగ్రెస్ ప్రభుత్వంలో అనేక దారుణాలు జరుగుతున్నాయి. కొందరు ఓ పారిశ్రామికవేత్త తలకు తుపాకి పెట్టి రూ.300 కోట్లు డిమాండ్ చేస్తే.. దానిపై విచారణ చేయడానికి సిట్ ఉండదు. ఇసుక దందాల్లో రూ.కోట్లు దండుకుంటుంటే... హైదరాబాద్ శివార్లలో రూ.వందల కోట్ల భూకబ్జాలకు పాల్పడితే సిట్ ఏదీ? ఓ జాతీయ రహదారి గుత్తేదారును మారణాయుధాలతో బెదిరిస్తే విచారణ ఎందుకు జరిపించడం లేదు. కస్తూర్బా పాఠశాలల్లో బంకర్ బెడ్ల కొనుగోలులో అక్రమాలపై దర్యాప్తు ఎందుకు చేపట్టడంలేదు. రూ.వందల కోట్ల లిక్కర్ కుంభకోణంపై ఎందుకు మౌనంగా ఉన్నారు'' అని కేటీఆర్ ప్రశ్నించారు.

**న్యూయార్క్‌లోని సీబీఎస్‌లో ప్రసంగించాలని కేటీఆర్‌కు ఆహ్వానం**

**హైదరాబాద్, న్యూయార్క్ నగరంలోని కొలంబియా బిజినెస్ స్కూల్(సీబీఎస్)లో ఏప్రిల్ 4న జరిగే '21వ వార్షిక ఇండియా బిజినెస్ కాన్ఫరెన్స్'లో ప్రసంగించాలని కేటీఆర్‌కు ఆహ్వానం అందింది. ఈ సదస్సును నిర్వహించే విద్యార్థి విభాగం 'సౌత్ ఆసియా బిజినెస్ అసోసియేషన్' ఆయనను ఆహ్వానించింది. హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో జరిగే 'హార్వర్డ్ ఇండియా కాన్ఫరెన్స్'కు ఇటీవలే కేటీఆర్‌కు ఆహ్వానం అందిన విషయం తెలిసిందే.**

# పంచాయతీల్లో సంక్రాంతి సంబురం..

## రూ.277 కోట్ల నిధులు విడుదల చేసిన ప్రభుత్వం




**ఈ-కబురు రాష్ట్రంలోని గ్రామ పంచాయతీలకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని గ్రామాల అభివృద్ధి, ఇతర అవసరాల కోసం ఏకంగా రూ.277 కోట్ల నిధులను విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. డిప్యూటీ సీఎం, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క (Mallu ఆదేశాల మేరకు ఆర్థిక శాఖ నుంచి నిధులు విడుదల అయ్యాయి. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సర్పంచ్‌లు, వార్డు మెంబర్లు, గ్రామ ప్రతినిధులకు ఆయన సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. కాగా, తాజాగా విడుదల చేసిన నిధులతో గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తి కావడమే కాకుండా, పంచాయతీల నిర్వహణ మరింత సులభతరం కానుంది. సంక్రాంతి పండుగ వేళ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంపై స్థానిక సంస్థల ప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.**

# వందే భారత్ స్లీపర్ ఎక్స్‌ప్రెస్ ఛార్జీలు ఖరారు



భారతీయ రైల్వే చరిత్రలో మరో కీలక ఘట్టం ఆవిష్కృతం కానుంది. ప్రయాణికులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న దేశంలోనే తొలి వందే భారత్ స్లీపర్ ఎక్స్‌ప్రెస్ ఈ నెలలోనే పట్టాలెక్కనుంది. పశ్చిమ బెంగాల్‌లోని హౌరా, అస్సాంలోని గువాహతి (కామాఖ్య) మధ్య ఈ రైలు తన ప్రయాణాన్ని ప్రారంభించనుంది. దీనికి సంబంధించిన టికెట్ ధరలు, రిజర్వేషన్ నిబంధనలను రైల్వే బోర్డు అధికారికంగా వెల్లడించింది.

జనవరి 17న ప్రారంభం

రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించిన సమాచారం ప్రకారం.. ఈ రైలుకు సంబంధించిన ట్రయల్ రన్, టెస్టింగ్, భద్రతా సర్టిఫికేషన్ ప్రక్రియలు విజయవంతంగా పూర్తయ్యాయి. జనవరి 17, 2026న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ రైలును జెండా ఊపి ప్రారంభించనున్నారు. సాధారణ ప్రయాణికులకు జనవరి 18 నుంచి అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.

వందే భారత్ స్లీపర్ రైలులో ప్రయాణికులకు అత్యుత్తమ అనుభూతిని అందించేందుకు రైల్వే బోర్డు విప్లవాత్మక నిర్ణయం తీసుకుంది. ఈ రైలులో కేవలం 'కన్ఫర్మ్' అయిన టిక్కెట్లు మాత్రమే జారీ చేస్తారు. సాధారణ రైళ్లలో ఉండే ఆర్ఏసీ లేదా వెయిటింగ్ లిస్ట్ ఇందులో ఉండదు. అంటే, రైలు చార్ట్ సిద్ధమైన తర్వాత సీటు కేటాయించబడని వారికి ప్రయాణించే అవకాశం ఉండదు. అడ్వాన్స్ రిజర్వేషన్ కాలపరిమితి (ARP) మొదటి రోజు నుంచే అన్ని బెర్తులు బుకింగ్ కోసం అందుబాటులో ఉంటాయి.

టికెట్ ధరలు, కనీస ఛార్జీ

రైల్వే బోర్డు ఇటీవల ప్రకటించిన సర్క్యులర్ ప్రకారం, వందే భారత్ స్లీపర్ ఛార్జీలు కిలోమీటరు ప్రాతిపదికన నిర్ణయించారు.

కనీస ఛార్జీ: ప్రయాణికులు కనీసం 400 కిలోమీటర్ల దూరానికి ఛార్జీ చెల్లించాల్సి ఉంటుంది.

3 ఏసీ కిలోమీటరుకు రూ.2.4 (కనీస ధర రూ.960)

2 ఏసీ: కిలోమీటరుకు రూ.3.1 (కనీస ధర రూ.1,240)

1 ఏసీ: కిలోమీటరుకు రూ.3.8 (కనీస ధర రూ.1,520)

హౌరాగువాహతి మార్గంలో పూర్తి ప్రయాణానికి 3 ఏసీకి సుమారుగా రూ.2,300, 2 ఏసీకి రూ.3,000, ఫస్ట్ ఏసీకి రూ.3,600 (కేటరింగ్ ఛార్జీలతో కలిపి) ఉండొచ్చని అంచనా. వీటికి అదనంగా జీఎస్టీ ఛార్జీలు ఉండే అవకాశం ఉందని గమనించాలి.

రిజర్వేషన్ కోటాలు

ఈ రైలులో అన్ని రకాల కోటాలు వర్తించవు. కేవలం కింద పేర్కొన్న ముఖ్యమైన విభాగాలకు మాత్రమే రిజర్వేషన్ కోటా ఉంటుంది.

**1. మహిళలు**

**2. దివ్యాంగులు**

**3. సీనియర్ సిటిజన్లు**

**4. డ్యూటీ పాస్ కోటా (రైల్వే సిబ్బంది కోసం). మిగిలిన ఇతర ప్రత్యేక కోటాలకు ఈ రైలులో చోటు లేదు.**

**ఈ రైలు ప్రత్యేకతలు**

**మొత్తం 16 కోచ్‌లతో (11 థర్డ్ ఏసీ, 4 సెకండ్ ఏసీ, 1 ఫస్ట్ ఏసీ) నడవనున్న ఈ రైలులో 823 మంది ప్రయాణించవచ్చు. గంటకు 160 కిమీ వేగంతో ప్రయాణించగల సామర్థ్యం దీని సొంతం. అత్యాధునిక 'కవచ్' భద్రతా వ్యవస్థ, ఆటోమేటిక్ డోర్స్, విమాన స్థాయి సౌకర్యాలతో ఈ వందే భారత్ స్లీపర్ ప్రయాణికులకు సరికొత్త అనుభూతిని ఇవ్వనుందని భారతీయ రైల్వే తెలిపింది.**

# టాటా పంచ్ ఫేస్‌లిఫ్ట్ విడుదల.. ధర ₹5.59 లక్షల నుంచి ప్రారంభం

**ప్రముఖ కార్ల తయారీ సంస్థ టాటా మోటార్స్ పాసింజర్స్ వెహికల్స్.. టాటా పంచ్ ఫేస్‌లిఫ్ట్‌ను దేశీయ మార్కెట్లోకి విడుదల చేసింది. దీని ధర రూ.5.59 లక్షల (ఎక్స్-షోరూమ్) నుంచి ప్రారంభమవుతుంది. నేటి నుంచి (జనవరి 13) బుకింగ్స్ ప్రారంభిస్తున్నట్లు కంపెనీ తెలిపింది. ఈ సెగ్మెంట్‌లో హ్యుందాయ్ ఎక్స్‌టర్, నిస్సాన్ మాగ్నైట్, రెనో కైగర్, మహీంద్రా ఎక్స్‌యూవీ 3ఎక్స్‌ఓ వంటి కార్లతో ఇది పోటీ పడనుంది.**

టాటా పంచ్ ఫేస్‌లిఫ్ట్.. పంచ్.ఈవీని పోలి ఉంటుంది. కొత్త పంచ్‌లో ఎల్‌ఈడీ హెడ్‌ల్యాంప్స్‌ను రీడిజైన్ చేశారు. డీఆర్‌ఎల్స్‌ను కొత్తగా తీర్చిదిద్దారు. స్పోర్టియర్ బంపర్స్, సరికొత్త అల్లాయ్ డిజైన్, కొత్త ఎల్‌ఈడీ టెయిల్ ల్యాంప్ క్లస్టర్ ఆకట్టుకుంటాయి. ఆటోమేటిక్ హెడ్‌ల్యాంప్స్, రెయిన్ సెన్సింగ్ వైపర్స్, రేర్ వాషర్ వైపర్‌స్‌ను ఇచ్చారు. కొత్తగా సైంటిఫిక్, కారామెల్, బెంగాల్ రూజ్, కూర్గ్ క్లౌడ్స్ వంటి కలర్ ఆప్షన్స్‌తో పంచ్ లభిస్తుంది.

ఇంటీరియర్ పరంగానూ పలు మార్పులు చేశారు. ఇందులో 26.03 సెంటిమీటర్ల టచ్‌స్క్రీన్ ఇన్ఫోటైన్‌మెంట్ యూనిట్, 17.8 సెంటిమీటర్ల డిజిటల్ క్లస్టర్ ఉన్నాయి. 360 డిగ్రీల సరౌండ్ వ్యూ, ఆటోమేటిక్ క్లైమేట్ కంట్రోల్, ఆటోడిమ్మింగ్ ఐఆర్‌వీఎం వంటివి ఉన్నాయి. అడల్ట్, చైల్డ్ సేఫ్టీ పరంగా 5 స్టార్ రేటింగ్ ఉంది. 6 ఎయిర్‌బ్యాగులు ఇచ్చారు. టాటా పంచ్ ఫేస్‌లిఫ్ట్ 1.2 లీటర్ ఐటర్బో పెట్రోల్ ఇంజిన్, 1.2 లీటర్ రెవోట్రాన్ (పెట్రోల్ ఇంజిన్), సీఎన్‌జీ వంటి ఇంజిన్ ఆప్షన్లతో లభిస్తుంది. మొత్తం ఆరు వేరియంట్లు అందుబాటులో ఉంటాయి.



### ఇరాన్‌తో వ్యాపారం చేస్తే 25శాతం టారిఫ్‌లు..

# భారత్‌పై ప్రభావం ఎంత?



**రష్యా చమురు కొనుగోళ్ల కారణంగా ఇప్పటికే 50శాతం సుంకాలను ఎదుర్కొంటోన్న భారత్‌కు తాజాగా మరో సవాల్ ఎదురైంది. ఇరాన్‌తో వ్యాపారం చేసే దేశాలపై 25 శాతం టారిఫ్‌లు విధిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటనే ఇందుక్కారణం. ఎందుకంటే ఇరాన్ ప్రధాన వాణిజ్య భాగస్వామ్య దేశాల్లో భారత్ కూడా ఒకటి..!**

**ఇరాన్-భారత్ వాణిజ్యం ఇలా..**

టెహ్రాన్‌లోని భారత ఎంబసీ గణాంకాల ప్రకారం.. 202425 ఆర్థిక సంవత్సరంలో మన దేశం 1.24 బిలియన్ డాలర్ల విలువైన ఉత్పత్తులను ఇరాన్‌కు ఎగుమతి చేసింది. ఇదే సమయంలో 0.44 బిలియన్ డాలర్ల విలువైన వస్తువులను టెహ్రాన్ నుంచి దిగుమతి చేసుకుంది. అంటే ఇరుదేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం విలువ దాదాపు 1.68 బిలియన్ డాలర్లుగా ఉంది. అంటే భారత కరెన్సీలో దాదాపు రూ.15వేల కోట్లకు పైమాటే.

**ఇరాన్‌తో వ్యాపారం చేసే దేశాలపై 25 శాతం సుంకాలు: ట్రంప్ కీలక నిర్ణయం**

భారత్ నుంచి ప్రధానంగా బియ్యం, తేయాకు, చక్కెర, ఫార్మా, ఆర్గానిక్ రసాయనాలు వంటివి ఇరాన్‌కు ఎగుమతి అవుతున్నాయి. వీటిలో అత్యధికంగా సేంద్రియ రసాయనాల ఎగుమతుల విలువ 512.92 మిలియన్ డాలర్లుగా ఉంది. ఇక, టెహ్రాన్ నుంచి మనం పెట్రోలియం ఉత్పత్తులు, ప్లాస్టిక్, పండ్లు, నట్స్ వంటి వాటిని దిగుమతి చేసుకుంటున్నాం. 202425 ఆర్థిక సంవత్సరంలో 311.60 బిలియన్ డాలర్ల విలువైన పిస్తా, ఇతర ఎండుఫలాలు, నట్స్ ఇరాన్ నుంచి దిగుమతి అయ్యాయి.

అయితే ట్రంప్ నిర్ణయం వాణిజ్యపరంగానే గాక, భారత వ్యూహాత్మక ప్రయోజనాల పైనా ప్రతికూల ప్రభావం చూపించే అవకాశం ఉంది. భారత ప్రాంతీయ అనుసంధాన ప్రణాళికలు, సరఫరా గొలుసుకు ఇరాన్‌తో కలిసి చేపడుతోన్న చాబహార్ పోర్ట్ ప్రాజెక్ట్ అత్యంత కీలకం. గతంలో అమెరికా ఇరాన్‌పై ఆంక్షలు విధించిన సమయంలో ఈ పోర్ట్‌కు కొన్ని మినహాయింపులు కల్పించింది. ఇప్పుడు తాజా టారిఫ్‌ల ప్రకటనతో ఈ ప్రాజెక్ట్ భవితవ్యంపై అనిశ్చితి నెలకొంది.

**75శాతం బాదుడు తప్పదా?**

రష్యా చమురు కొనుగోలు చేస్తోందన్న కారణంతో ఇప్పటికే భారత ఉత్పత్తులపై ట్రంప్ 50శాతం సుంకాలను (Trump Tariffs on India) వసూలు చేస్తోన్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే రెండు దేశాలు ట్రేడ్ డీల్ చేసుకునేందుకు గత కొన్ని నెలలుగా చర్చలు జరుపుతున్నాయి. ఈ పరిణామాల వేళ తాజా టారిఫ్‌ల ప్రకటనతో భారత్‌అమెరికా వాణిజ్యఒప్పందంపై మరోసారి సందిగ్ధత నెలకొంది. అంతేకాదు.. ఇరాన్‌తో వాణిజ్య సంబంధాలు కొనసాగితే.. భారత ఉత్పత్తులపై అమెరికా సుంకాలు 75 శాతానికి పెరుగుతాయి. అది మన దేశంలోని పలు రంగాలపై తీవ్ర ప్రభావం చూపించే అవకాశం ఉంది. అయితే, ట్రంప్ (Donald Trump) తాజాగా ప్రకటించిన టారిఫ్‌లు ఎంతవరకు అమల్లో ఉంటాయనే దానిపైనా స్పష్టత లేదు. ఎందుకంటే.. ప్రపంచ దేశాలపై అమెరికా అధ్యక్షుడు విధిస్తున్న టారిఫ్‌లకు చట్టబద్ధత ఉందా? లేదా అన్నదానిపై అగ్రరాజ్యంలోని సుప్రీంకోర్టు బుధవారం (అమెరికా కాలమానం ప్రకారం) కీలక తీర్పు వెలువరించనుంది.

**అలా జరిగితే అమెరికాకు ఇబ్బందే: ట్రంప్**

**సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో ట్రంప్ స్పందిస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. "టారిఫ్‌లకు వ్యతిరేకంగా సుప్రీంకోర్టు తీర్పు వెలువరిస్తే అమెరికా వందల కొద్దీ బిలియన్ డాలర్లను తిరిగి చెల్లించాల్సి ఉంటుంది. అలాగే మన దేశంలోకి పెట్టుబడులు కూడా తగ్గుతాయి. ఇతర దేశాలు మన దగ్గరకు వచ్చి ఫ్యాక్టరీలు, ప్లాంట్లను నిర్మించరు. ఈ టారిఫ్‌లతో ఇప్పుడు అమెరికా వెలిగిపోతోంది. ఇదిలాగే కొనసాగాలి. జాతీయ భద్రతకు సంబంధించిన ఈ విషయంలో సుప్రీం తీర్పు వ్యతిరేకంగా వస్తే మాత్రం అది అమెరికాకు తీవ్ర ఇబ్బందే" అని ట్రంప్ సోషల్ మీడియాలో రాసుకొచ్చారు.**

### విపణిలోకి బ్రిటన్

# మడ్డీఫాక్స్ సైకిళ్లు



**ముంబయి: బ్రిటన్ సంస్థ మడ్డీఫాక్స్ 18 మోడళ్ల సైకిళ్లను దేశీయ విపణిలోకి విడుదల చేస్తున్నట్లు సోమవారం ప్రకటించింది. రోమ్, కైలాన్ బైసైకిల్ బ్రాండ్లను కలిగి ఉన్న అనంత వెంచర్స్‌తో ఇందుకోసం ఒప్పందంపై సంతకం చేసినట్లు మడ్డీఫాక్స్ తెలిపింది. భారత్‌లో తమ ప్రత్యేక డిస్ట్రిబ్యూటర్‌గా అనంత వెంచర్స్ ఉంటుందని పేర్కొంది. 'ఐరోపాలో ప్రాచుర్యం పొందిన తాము, భారతీయ వినియోగదార్ల అవసరాలకు తగ్గట్లు మారేందుకు సిద్ధంగా ఉన్నామ'ని మడ్డీఫాక్స్ ఆసియా పసిఫిక్ ప్రాంత ఎండీ సాహిల్ మెహ్రోత్రా వెల్లడించారు. కంపెనీ ఉత్పత్తి శ్రేణిలో రోడ్లపై, పర్వత ప్రాంతాల్లో సైక్లింగ్‌కు తోడ్పడేవి, హైబ్రిడ్ బైక్‌లు ఉన్నాయి. మహిళలు-పిల్లల కోసం ప్రత్యేక బైక్‌లు ఉన్నాయని సంస్థ పేర్కొంది. 'ధరలు బేరీజు వేసుకునే వినియోగదార్ల కోసం మా వద్ద రోమ్, కైలాన్ బ్రాండ్లు ఉన్నాయి. అధిక-నాణ్యత, ప్రీమియం బ్రాండ్ ఉత్పత్తులు, గొప్ప రైడింగ్ అనుభూతి కోసం మడ్డీఫాక్స్ ఉత్పత్తులు లభిస్తాయని' అనంత వెంచర్స్ మేనేజింగ్ పార్ట్‌నర్ అజిత్ గాంధీ వెల్లడించారు.**

# 'హెచ్‌సీఎల్' ఆదాయం పెరిగినా.. లాభం తగ్గింది

ఐటీ సేవల సంస్థ హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం అక్టోబరుడిసెంబరులో రూ.4,076 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని నమోదు చేసింది. 202425 ఇదే కాల లాభం రూ.4,591 కోట్లతో పోలిస్తే ఇది 11.2% తక్కువ. కార్యకలాపాల ఆదాయం రూ.29,890 కోట్ల నుంచి 13.3% పెరిగి రూ.33,872 కోట్లకు చేరింది. సెప్టెంబరు త్రైమాసికంతో పోలిస్తే, నికర లాభం 3.7% తగ్గినా, ఆదాయం 6% పెరిగింది.

'సమీక్షా త్రైమాసికంలో బలమైన ఆదాయం నమోదు కావడంతో, ఆర్థిక సంవత్సరంలో ఆదాయం 15 బి.డాలర్లు (సుమారు రూ.1.35 లక్షల కోట్లు) అధిగమించే అవకాశం కనిపిస్తోంది. కొత్త ఆర్డర్లు 3 బి.డాలర్ల (రూ.27,000 కోట్ల) మేర లభించాయి. సాఫ్ట్‌వేర్ ఆదాయం స్థిర కరెన్సీ ప్రకారం త్రైమాసిక ప్రాతిపదికన 28.1%, వార్షిక ప్రాతిపదికన 3.1% పెరిగాయి. క్లయింట్ల ఏఐ గిరాకీకి తగ్గట్లు, మేం రూపాంతరం చెందుతున్నామ'ని హెచ్‌సీఎల్ టెక్ సీఈఓ, ఎండీ సి.విజయకుమార్ వెల్లడించారు.

సమీక్షా త్రైమాసికంలో హెచ్‌సీఎల్ టెక్ 2,852 మంది తాజా ఉత్తీర్ణుల (ఫ్రెషర్స్)ను తీసుకుంది. డిసెంబరు ఆఖరుకు మొత్తం ఉద్యోగుల సంఖ్య 2,26,379కు చేరింది.

ఫ్రెషర్లలో అత్యున్నత నైపుణ్యాలుంటే: ఎలైట్ ఇంజినీర్ల నియామక వ్యూహంలో భాగంగా, అధునాతన నైపుణ్యాలున్న తాజా ఉత్తీర్ణులకు వార్షికంగా రూ.1822 లక్షల వేతనం చెల్లించేందుకు కంపెనీ సిద్ధమైంది. ప్రామాణిక ప్రారంభ స్థాయి ఉద్యోగుల వేతనాలతో పోలిస్తే ఇది 34 రెట్లు ఎక్కువ.

విక్రయ వృద్ధి అంచనాల్లో మార్పులు

హెచ్‌సీఎల్ టెక్ 202526 విక్రయాల్లో గరిష్ఠ వృద్ధి అంచనాను 5% నుంచి 4.5 శాతానికి కుదించినా, కనిష్ఠ వృద్ధి అంచనాను 3% నుంచి 4 శాతానికి పెంచింది. అంటే ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో, విక్రయాల అంచనాల్లో వృద్ధి స్థిర కరెన్సీ ప్రాతిపదికన 44.5 శాతంగా ఉంచింది. సెప్టెంబరు త్రైమాసికం ఆఖర్లో ఇది 35 శాతంగా తెలిపింది. సేవల విభాగంలో 202526 విక్రయాల వృద్ధి అంచనాను 45% నుంచి 4.755.25 శాతానికి పెంచింది. డిసెంబరు త్రైమాసికంలో స్థిర కరెన్సీ వద్ద ఈ విభాగంలో ఆదాయ వృద్ధి 5 శాతంగా నమోదైంది.

కంపెనీ ఆదాయ వృద్ధి అంచనాను 1718% వద్ద మార్పు లేకుండా ఉంచింది. కొత్త లేబర్ కోడ్‌ల అమలు నేపథ్యంలో, గ్రూప్‌లోని ఉద్యోగుల ప్రయోజనాల కోసం, ఏక కాల కేటాయింపులు రూ.9,560 కోట్లు జరిపినట్లు .. ఈ ప్రభావాన్ని మినహాయిస్తూ, ఇచ్చిన ఎబిటా మార్జిన్ అంచనా ఇది. అని వివరించింది.

రూ.2 ముఖ విలువ కలిగిన ఒక్కో షేరుకు రూ.12 చొప్పున మధ్యంతర డివిడెండు చెల్లించనున్నారు.




# మూలధన వ్యయం నిధుల వినియోగంలో ఏపీ స్థానం ఎంతంటే..

రాష్ట్రాల్లో మౌలిక సదుపాయాల కల్పన కోసం కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న 'రాష్ట్రాలకు మూలధన పెట్టుబడి కోసం ప్రత్యేక సహాయంస్కీమ్ ఫర్ స్పెషల్ అసిస్టెంట్ టు స్టేట్స్ ఫర్ క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్ (SASCI)' పథకం కింద నిధులను పొందడంలో ఉత్తరప్రదేశ్ దేశంలోనే అగ్రస్థానంలో నిలిచింది. 2026 బడ్జెట్ ప్రతిపాదనల నేపథ్యంలో వెలువడిన గణాంకాల ప్రకారం, యూపీ తర్వాత మధ్యప్రదేశ్, బిహార్, మహారాష్ట్ర, అస్సాం రాష్ట్రాలు అత్యధిక నిధులు పొందిన జాబితాలో ఉన్నాయి.

**నిధుల కేటాయింపు వివరాలు**

కేంద్ర ఆర్థిక శాఖ గణాంకాల ప్రకారం, ఈ పథకం కింద రాష్ట్రాలకు 50 ఏళ్ల కాలపరిమితితో వడ్డీ లేని రుణాలను కేంద్రం అందజేస్తోంది. ఇందులో భాగంగా 202526 బడ్జెట్‌లో ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి రూ.1.5 లక్షల కోట్లను కేటాయించగా, జనవరి 4, 2026 నాటికి రూ.83,600 కోట్లను రాష్ట్రాలకు విడుదల చేశారు. అయితే అక్టోబర్ 2020 నుంచి ఇప్పటి వరకు (జనవరి 4, 2026 వరకు) ఈ పథకం కింద మొత్తం రూ.4.50 లక్షల కోట్లను రాష్ట్రాలకు అందజేశారు. గత మూడేళ్ల డేటా ప్రకారం.. ఉత్తరప్రదేశ్‌కు రూ.52,000 కోట్లు, మధ్యప్రదేశ్, బిహార్‌కు చెరో రూ.36,000 కోట్లు, మహారాష్ట్ర, అస్సాంకు రూ.23,000 కోట్లకు పైగా కేటాయించారు. ఈ క్రమంలో ఆంధ్రప్రదేశ్‌కు రూ.21,590 కోట్లు కేటాయించడంతో ఏడో స్థానంలో నిలిచింది.

**పథకం నేపథ్యం - ప్రాధాన్యత**

కొవిడ్ సమయంలో ఆర్థిక వ్యవస్థకు దన్నుగా నిలిచేందుకు, రాష్ట్రాల్లో ఆస్తుల కల్పనను వేగవంతం చేయడానికి కేంద్రం ఈ పథకాన్ని ప్రవేశపెట్టింది. మొదట రూ.12,000 కోట్లతో ప్రారంభమైన ఈ పథకం, రాష్ట్రాల నుంచి వచ్చిన సానుకూల స్పందనతో 202526 నాటికి రూ.1,50,000 కోట్లకు చేరుకుంది. రాష్ట్రాలు తమకు నచ్చిన మూలధన ప్రాజెక్టుల కోసం ఈ నిధులను వాడుకోవచ్చు. కేంద్రం నిర్దేశించిన నిర్దిష్ట రంగాల్లో సంస్కరణలు చేపట్టినందుకు ప్రోత్సాహకంగా కూడా వీటిని ఉపయోగించుకోవచ్చు.

**బడ్జెట్ వేళ రాష్ట్రాల విజ్ఞప్తి**

ఇటీవల జరిగిన బడ్జెట్ ముందస్తు సమావేశాల్లో మెజారిటీ రాష్ట్రాలు ఎస్ఏఎస్‌సీఐ పథకాన్ని మరిన్ని నిధులతో కొనసాగించాలని కోరాయి. మూలధన వ్యయం వల్ల ప్రైవేటు పెట్టుబడులు పెరుగుతాయని, ఇది ఆర్థిక వృద్ధికి దోహదపడుతుందని ఆర్థిక శాఖ భావిస్తోంది. ఈ నేపథ్యంలో రాబోయే కేంద్ర బడ్జెట్‌లో ఈ పథకానికి మరింత ప్రాధాన్యత దక్కే అవకాశం ఉందనే అభిప్రాయాలున్నాయి.



# పీఆర్ గేమ్'.. మరో స్థాయికి వెళ్లిపోయింది: తాప్సీ



హిందీ పరిశ్రమలో ప్రతి దానికి డబ్బులు చెల్లించాల్సిన పరిస్థితి వచ్చిందని తాప్సీ అన్నారు. ఇండస్ట్రీలో ఒకరిని పడేయాలన్నా.. మరొకరిని ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలన్నా డబ్బే కీలకమైందని చెప్పారు. తాజా ఇంటర్వ్యూలో ఆమె పీఆర్ వ్యవస్థ గురించి మాట్లాడారు. "నేను నా సొంత పనులు చేసుకుంటూ బిజీగా ఉన్నాను. కానీ, ఏడాదిన్నర నుంచి ఇండస్ట్రీలో చాలా మార్పులు వచ్చాయి. పీఆర్ గేమ్ వేరే స్థాయికి వెళ్లిందని నేను గ్రహించాను. ఇక్కడ ప్రతి దానికి డబ్బు చెల్లించాలి. మన ప్రతిభను కూడా డబ్బుతోనే ముడిపెడతారు. మీ విజయం వేరొకరి వైఫల్యంపై ఆధారపడి ఉంటుందనేలా కొత్త వెర్షన్‌ను సృష్టించారు. కానీ, నా మనస్తత్వం పూర్తి భిన్నమైనది. మన పనే మన గురించి చెప్పాలని భావిస్తాను. ఇలాంటి వాటికి డబ్బును వెచ్చించను. నా సొంత పనుల కోసం డబ్బును ఉపయోగిస్తాను. నా ప్రయాణాలు, నా కుటుంబం కోసం ఖర్చు చేస్తాను. నన్ను ప్రశంసిస్తూ వ్యాసాలు రాయడానికి, నన్ను పొగడడం కోసం మాత్రమే సోషల్ మీడియా ఖాతాలకు రూ.50వేలు చెల్లించడానికి నా దగ్గర అంత డబ్బు లేదు" అని తాప్సీ తెలిపారు.

ప్రస్తుతం తాప్సీ.. 'గాంధారి' తో బిజీగా ఉన్నారు. తల్లీకూతుళ్ల సెంటిమెంట్‌తో ఇది రానుంది. ఇందులో తాప్సీ తల్లిగా కనిపించనున్నారు. నెట్‌ఫ్లిక్స్ వేదికగా ఇది విడుదల కానుంది.



## భారీ సెట్లో క్లైమాక్స్!



పెద్ది'ని చెప్పిన తేదీకి చెప్పినట్లుగానే ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు నిర్విరామంగా శ్రమిస్తున్నారు కథానాయకుడు రామ్‌చరణ్. ఆయన టైటిల్ పాత్రలో నటిస్తున్న ఈ పాన్ ఇండియా చిత్రాన్ని బుచ్చిబాబు సానా తెరకెక్కిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వెంకట సతీశ్ కిలారు నిర్మిస్తున్నారు. జాన్వీ కపూర్ కథానాయిక. శివ రాజ్‌కుమార్, జగపతిబాబు, దివ్యేందు శర్మ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమా మార్చి 27న ప్రేక్షకుల ముందుకు రానున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే మిగిలిన చిత్రీకరణను చకచకా పూర్తి చేసే పనిలో పడింది చిత్ర బృందం. దీనిలో భాగంగా క్లైమాక్స్ చిత్రీకరణ ప్రారంభించినట్లు తెలిసింది. హైదరాబాద్‌లో సిద్ధం చేసిన భారీ సెట్‌లో చరణ్‌తో పాటు కీలక తారాగణంపై యాక్షన్ సన్నివేశాలను తెరకెక్కిస్తున్నారు. ఇప్పటికే ఈ చిత్ర ఫస్ట్‌హాఫ్ కట్ సిద్ధమైందని.. సెకండాఫ్‌కు సంబంధించిన నిర్మాణానంతర పనులు శరవేగంగా జరుగుతున్నాయని.. నెలాఖరు కల్లా టాకీ పార్ట్ ముగించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారని తెలుస్తోంది. ఆటలతో ముడిపడిన ఈ పీరియాడిక్ యాక్షన్ డ్రామాలో చరణ్ ఆట కూలీగా కనిపించనున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఈ చిత్రానికి ఏఆర్ రెహమాన్ సంగీతమందిస్తున్నారు.

## భర్త మహాశయులకు విజ్ఞప్తి..
# రవితేజ ఖాతాలో హిట్ పడిందా?




**భర్త మహాశయులకు విజ్ఞప్తి; నటీనటులు: రవితేజ, ఆషికా రంగనాథ్, డింపుల్ హయాతి, సునీల్, సత్య, మురళీధర్ గౌడ్, రోహన్, సోనియా సింగ్, తారక్ పొన్నప్ప తదితరులు; సంగీతం: భీమ్స్ సిసిరోలియో; నిర్మాత: సుధాకర్ చెరుకూరి; రచన, దర్శకత్వం: కిషోర్ తిరుమల; విడుదల: 13-01-2026**

**ఫ్యామిలీ డాక్టర్ చెప్పాడంటూ కత్తులు, గన్నుల్ని పక్కనపెట్టేసి... తనకున్న మాస్ మహారాజ్ అనే బిరుదునీ ఈసారికి మరిచిపోదాం అంటూ ఓ కుటుంబ కథని ఎంచుకుని రవితేజ చేసిన సినిమానే 'భర్త మహాశయులకు విజ్ఞప్తి'. సున్నితమైన కథలకు పెట్టింది పేరైన కిశోర్ తిరుమల దర్శకుడు కావడంతో రవితేజని కొత్తగా చూసే అవకాశం ఉంటుందనే ఆశ ప్రేక్షకుల్లో కలిగింది. మరి అందుకు తగ్గట్టుగా సినిమా ఉందా? రవితేజకు విజయాన్ని అందించిందా?**

కథేంటంటే..

రామ్ సత్యనారాయణ (రవితేజ), బాలామణి (డింపుల్ హయాతి) భార్యాభర్తలు. తన భర్త రామ్‌పై బాలామణికి ఎంతో నమ్మకం. తను తప్ప వేరే ప్రపంచం తెలియని మనిషి అనుకుంటుంది. తన కుటుంబానికి చెందిన వ్యాపార వ్యవహారాల్లో భాగంగా రామ్ స్పెయిన్ వెళ్లాల్సి వస్తుంది. అక్కడ అనుకోకుండా మానస శెట్టి (ఆషికా రంగనాథ్)తో బంధం ఏర్పడుతుంది. తనకి పెళ్లయ్యిందనే విషయాన్ని దాచి మరీ, తనని తాను సత్య అని పరిచయం చేసుకుని మానసకు దగ్గరవుతాడు. ఏమీ జరగనట్టే ఇంటికి తిరిగొచ్చిన రామ్ సత్యనారాయణ తనపై తన భార్య చూపిస్తున్న ప్రేమతో అప్పుడప్పుడూ అపరాధ భావానికి గురవుతుంటాడు. ఇంతలోనే స్పెయిన్ నుంచి మానస ఇండియాకి వస్తుంది. ఆమె వచ్చాక ఏం జరిగింది? ఇద్దరి మధ్య బంధం కొనసాగిందా? భార్య బాలామణికి ఈ విషయం తెలిసిందా ?రామ్ అలియాస్ సత్యకు పెళ్లయ్యిందనే విషయం తెలిశాక మానస ఏం చేసింది? తదితర విషయాల్ని తెరపై చూసి తెలుసుకోవాల్సిందే.

ఎలా ఉందంటే..

భావోద్వేగాల్ని సున్నితంగా ఆవిష్కరిస్తూ ఓ కొత్త కథాంశాన్ని, సంఘర్షణని తెరపై స్పృశించినట్టుగా.. క్లాస్‌గా సాగిపోతుంటాయి కిశోర్ తిరుమల సినిమాలు. ఈసారి ఆయన ఎంచుకున్న కథాంశం కాస్త పలుచగా అనిపిస్తుంది. ఇద్దరమ్మాయిల మధ్య నలిగిపోయిన చాలా మంది కథానాయకుల్ని, కథల్ని గుర్తు చేస్తుంది ఈ చిత్రం. కానీ, హాస్యంపై మాత్రం ప్రత్యేకంగా దృష్టిపెట్టారు. సందర్భోచితమైన హాస్యంతో సినిమా సరదా సరదాగా సాగుతూ, మంచి కాలక్షేపాన్నిస్తుంది. అంతకుముందు చేసిన సినిమాలతో పోలిస్తే కిశోర్ తిరుమల సినిమాలతో కథానాయకులు కొత్తగా కనిపిస్తుంటారు. ఈ సినిమాలోనూ అదే పునరావృతమైంది. రవితేజ కొత్తగానే కనిపించారు. ఆయన లుక్, పాత్రలో ఒదిగిపోయిన తీరు, అలవోకగా ఆయన వినోదం పంచిన తీరు బాగుంది. ఆయన గత సినిమాలతో పోలిస్తే ఇది ఎంతో ఉపశమనం. స్పెయిన్ నేపథ్యంలో కథ మొదలవుతుంది. సత్య, వెన్నెల కిశోర్, సునీల్ తదితరులతో రవితేజ చేసే హంగామా బాగా నవ్విస్తుంది. మానస శెట్టి ఇండియాకి వచ్చినప్పటి నుంచి సినిమా మరింత సందడిగా మారిపోతుంది. విరామ సన్నివేశాల వరకూ సినిమా ఆసక్తికరంగా అనిపిస్తుంది. ఆ తర్వాతే కథలో సంఘర్షణ తగ్గింది. మానస శెట్టికి తోడుగా మరో శెట్టి పాత్ర తోడై సన్నివేశాలు సాగిపోతాయే తప్ప కథలో మాత్రం కొత్తగా మారేదేమీ ఉండదు.

తొలి సగభాగం తరహాలోనే కథానాయకుడు ఇద్దరు హీరోయిన్ల మధ్య నలిగిపోవడం కనిపిస్తుంటుంది. కాకపోతే బాబాయ్ అంటూ త్రినేత్ర పాత్ర చేసే హంగామా కాస్త నవ్వుల డోసుని పెంచుతుంది. స్పెయినా.. పెయినా.. అంటూ కథలో కొత్త టెన్షన్ మొదలవుతుంది. దాంతో పతాక సన్నివేశాల్లో సంఘర్షణ మోతాదు పెరుగుతుందేమో అనుకుంటాం. కానీ, అందుకు భిన్నంగా ఇలాంటి సమస్యలకు ఓ కొత్త పరిష్కారాన్ని చూపించి.. కథానాయకుడితో ఓ కొత్త విషయాన్ని చెప్పించి కథని ముగించారు. చాలా సార్లు చూసినట్టుగా, అసలు ఉందా లేదా అనిపించే కథతోనే దర్శకుడు నవ్వులు పండించాడు. సోషల్ మీడియాను అనుసరించే వాళ్లను ఇందులోని సంభాషణలు మరింత అలరిస్తాయి. పాటలకు తగ్గట్టుగా సన్నివేశాల రచన సాగలేదనిపిస్తుంది. మొత్తంగా కాలక్షేపానికి ఏమాత్రం ఢోకా లేదు.

ఎవరెలా చేశారంటే..

రవితేజ (Ravi Teja) హుషారైన నటన ఈ సినిమాకి ప్రత్యేక ఆకర్షణ. ఆయన సహజంగా పాత్రలో ఒదిగిపోయి, స్వేచ్ఛగా నవ్వులు పండించారు. ఆయన డ్యాన్సులు ఆకట్టుకుంటాయి. కథానాయికలు డింపుల్ హయాతి, ఆషికా రంగనాథ్ పర్వాలేదనిపిస్తారు. ఆషికా ట్రెండీగా కనిపించింది. 'వామ్మో వాయ్యో' పాటలో ఇద్దరి డ్యాన్స్ ఆకట్టుకుంటుంది. సునీల్, వెన్నెల కిశోర్, సత్య, మురళీధర్ గౌడ్, రోహన్.. పాత్రల నేపథ్యంలో పండిన కామెడీ ఈ సినిమాకి హైలైట్. సాంకేతిక విభాగాల్లో సినిమాటోగ్రఫీ, సంగీతం బాగా కుదిరాయి. స్పెయిన్ నేపథ్యంలో సాగే ప్రసాద్ మూరెళ్ల విజువల్స్ ఆకట్టుకుంటాయి. భీమ్స్ పాటలు, చిత్రీకరణ సినిమాకి ప్రధానబలం. కథ కన్నా కూడా వినోదానికే కిశోర్ తిరుమల పెద్ద పీట వేశారు. నిర్మాణం ఉన్నతంగా ఉంది.

బలాలు

**+ రవితేజ నటన**

**+ హాస్యం**

**+ ప్రథమార్ధం**

**బలహీనతలు**

**- కొత్తదనం లేని కథ, కథనాలు**

**సమీక్ష**

## పరాశక్తి'ని బ్యాన్ చేయండి..
# యూత్ కాంగ్రెస్ డిమాండ్



ఎన్నో ఒడుదొడుకులు ఎదుర్కొని ఎట్టకేలకు జనవరి 10న 'పరాశక్తి' (Parasakthi) ప్రేక్షకుల ముందుకువచ్చింది. సుధ కొంగర దర్శకత్వంలో రూపొందిన పీరియాడిక్ పొలిటికల్ యాక్షన్ డ్రామాపై విడుదల అనంతరం కూడా విమర్శలు వస్తున్నాయి. తాజాగా ఈ సినిమాను బ్యాన్ చేయాలంటూ తమిళనాడు యూత్ కాంగ్రెస్ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఓ ప్రకటనను విడుదల చేసింది. చరిత్రను వక్రీకరించారని, దివంగత ప్రధానమంత్రి ఇందిరాగాంధీ సహా కాంగ్రెస్ నాయకుల పరువుకు నష్టం కలిగించేలా చిత్రీకరించారని ఆరోపించింది.

"పరాశక్తి'ని కచ్చితంగా నిషేధించాలి. చరిత్రను తప్పుదోవ పట్టించే ఎన్నో సన్నివేశాలు ఇందులో ఉన్నాయి. శివకార్తికేయన్ పాత్ర ఇందిరాగాంధీని కలిసినప్పటి సన్నివేశాలు అన్నీ చిత్రబృందం ఊహించుకొని చిత్రీకరించింది. చరిత్రలో జరగని సంఘటనలతో దీన్ని రూపొందించారు. చారిత్రక ఆధారాలు లేని దృశ్యాలను నిర్లక్ష్యంగా సృష్టించారు. ఇందులో వాస్తవ సంఘటనలు చాలా తక్కువ ఉన్నాయి" అని తమిళనాడు యూత్ కాంగ్రెస్ సీనియర్ ఉపాధ్యక్షుడు అరుణ్ భాస్కర్ ప్రకటనలో పేర్కొన్నారు.

1965లో తమిళనాడులో హిందీ వ్యతిరేక నిరసనల నేపథ్యంలో ఈ సినిమా తెరకెక్కింది. ఈ చిత్రం క్లైమాక్స్‌లోనూ వివాదాస్పద సన్నివేశాలు ఉన్నాయని వాటిని తక్షణమే తొలగించాలని అరుణ్ భాస్కర్ డిమాండ్ చేశారు. సినిమా ప్రారంభం నుంచి టైటిల్ వరకూ ఏదోఒక సందర్భంలో 'పరాశక్తి' వార్తల్లో నిలుస్తూనే ఉంది. మొదట టైటిల్ విషయంలో, తర్వాత సెన్సార్ సర్టిఫికెట్, ట్రైలర్ విడుదలైన అనంతరం.. కొన్ని అభ్యంతరకరమైన సన్నివేశాలు ఉన్నాయని విమర్శలు ఎదుర్కొంది. ఇప్పుడు సినిమాను బ్యాన్ చేయాలని డిమాండ్ రావడంతో ఇండస్ట్రీలో చర్చనీయాంశంగా మారింది.

# కెప్టెన్ ధనాధన్

–అదరగొట్టిన హర్మన్‌ప్రీత్
–గుజరాత్‌పై ముంబయి విజయం



ముంబయి మురిసింది. భారీ స్కోర్ల మ్యాచ్‌లో అదరగొట్టింది. హర్మన్‌ప్రీత్ కౌర్ కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడిన వేళ.. ఆసక్తికర పోరులో గుజరాత్ టైటాన్స్‌ను ముంబయి ఓడించింది. 192 పరుగులు చేసినా టైటాన్స్‌కు ఓటమి తప్పలేదు. 2026 డబ్ల్యూపీఎల్‌లో ఆ జట్టుకిదే తొలి ఓటమి. ముంబయి ఇండియన్స్ సత్తా చాటింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (71 నాటౌట్; 43 బంతుల్లో 7×4, 2×6) మెరవడంతో మంగళవారం 7 వికెట్ల తేడాతో గుజరాత్ టైటాన్స్‌పై విజయం సాధించింది. జార్జియా వేర్‌హామ్ (43 నాటౌట్; 33 బంతుల్లో 4×4, 1×6), భార్తీ ఫుల్మాలి (36 నాటౌట్; 15 బంతుల్లో 3×4, 3×6) చెలరేగడంతో మొదట గుజరాత్ 5 వికెట్ల నష్టానికి 192 పరుగులు చేసింది. కనిక ఆహుజా (35; 18 బంతుల్లో 4×4, 2×6), బెత్ మూనీ (33; 26 బంతుల్లో 3×4, 1×6) రాణించారు. హర్మన్‌ప్రీత్‌తో పాటు అమన్‌జ్యోత్ కౌర్ (40; 26 బంతుల్లో 7×4), నికోలా కేరీ (38 నాటౌట్; 23 బంతుల్లో 6×4) కీలక ఇన్నింగ్స్ ఆడడంతో లక్ష్యాన్ని ముంబయి 19.2 ఓవర్లలో కేవలం మూడు వికెట్లు కోల్పోయి ఛేదించింది. డబ్ల్యూపీఎల్‌లో ముంబయికి ఇదే అత్యధిక లక్ష్య ఛేదన. ఆ జట్టు ఈ సీజన్‌లో రెండో విజయాన్ని ఖాతాలో వేసుకుంది.

**మెరిసిన హర్మన్......:** భారీ ఛేదనలో ముంబయికి గొప్ప ఆరంభమేమీ లభించలేదు. ఓపెనర్ కమలిని (12 బంతుల్లో 13)ని మూడో ఓవర్లోనే రేణుక వెనక్కి పంపింది. మరో ఓపెనర్ హేలీ మాథ్యూస్ (22; 12 బంతుల్లో 3×4, 1×6) ధాటిగానే ఆడినా ఎక్కువసేపు నిలవలేపోయింది. 5 ఓవర్లకు ముంబయి స్కోరు 37/2. అయితే అమన్‌జ్యోత్ కౌర్, కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ అదిరే భాగస్వామ్యంతో ఇన్నింగ్స్‌ను చక్కదిద్దారు. 12 ఓవర్లలో 109/2తో ముంబయి మెరుగైన స్థితిలో నిలిచింది. ఛేదన జోరుగా సాగుతున్న దశలో అమన్‌జ్యోత్‌ను ఔట్ చేయడం ద్వారా 72 పరుగుల మూడో వికెట్ భాగస్వామ్యాన్ని డివైన్ విడదీసింది. అయినా టైటాన్స్‌కు పెద్దగా ఉపశమనం లేదు. నికోలా కేరీ తోడుగా నిలవగా.. హర్మన్‌ప్రీత్ ధాటైన బ్యాటింగ్‌ను కొనసాగించింది. ఆఖరి మూడు ఓవర్లలో ఆ జట్టు 30 పరుగులు చేయాల్సిన పరిస్థితి. తర్వాతి ఓవర్లో హర్మన్‌ప్రీత్ రెండు ఫోర్లు బాదడం, బైస్ రూపంలో నాలుగు పరుగులు రావడంతో సమీకరణం తేలికైపోయింది. ఆఖరి ఓవర్లో రెండో బంతిని హర్మన్‌ప్రీత్ బౌండరీ దాటించడంతో విజయం ముంబయి సొంతమైంది.


మెరిసిన వేర్‌హామ్, ఫుల్మాలి: ఆఖర్లో జార్జియా వేర్‌హామ్, భార్తీ ఫుల్మాలి విరుచుకుపడడంతో అంతకుముందు గుజరాత్ టైటాన్స్ గట్టి లక్ష్యాన్ని నిర్దేశించగలిగింది. చెలరేగి ఆడిన ఈ జంట అభేద్యమైన ఆరో వికెట్‌కు 24 బంతుల్లోనే 56 పరుగులు జోడించింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన టైటాన్స్‌కు మంచి ఆరంభమే లభించింది. సోఫీ డివైన్ (8) ఈసారి త్వరగానే నిష్క్రమించినా.. మూనీ, కనిక ఆహుజా బ్యాట్ ఝుళిపించడంతో 6 ఓవర్లు ముగిసే సరికి ఆ జట్టు 62/1తో నిలిచింది. అయితే తర్వాతి ఓవర్లోనే మూనీని అమేలియా ఔట్ చేసింది. అయినా కనిక, గార్డ్‌నర్ ధనాధన్ షాట్లు ఆడడంతో స్కోరు బోర్డు వేగంగా కదిలింది. కానీ వరుస ఓవర్లలో గార్డ్‌నర్, కనిక నిష్క్రమించడంతో పరుగుల వేగానికి కళ్లెం పడ్డట్లయింది. 16వ ఓవర్ ముగిశాక, జట్టు స్కోరు 136 వద్ద సోనిని రిటైర్డ్ ఔట్‌గా వెనక్కి పిలిచారు. ఆ తర్వాత ఫుల్మాలితో పాటు వేర్‌హామ్ కూడా రెచ్చిపోయి ఆడడంతో ఆఖరి మూడు ఓవర్లలో టైటాన్స్ ఏకంగా 49 పరుగులు రాబట్టింది.

**గుజరాత్ ఇన్నింగ్స్.....:** బెత్ మూనీ (సి) అండ్ (బి) అమేలియా 33; సోఫీ డివైన్ (సి) కమలిని (బి) ఇస్మాయిల్ 8; కనిక (సి) నికోలా (బి) హేలీ 35; గార్డ్‌నర్ ఎల్బీ (బి) నికోలా 20; జార్జియా వేర్‌హామ్ నాటౌట్ 43; ఆయుషి సోని రిటైర్డ్ ఔట్ 11; భార్తీ ఫుల్మాలి నాటౌట్ 36; ఎక్స్‌ట్రాలు 6 మొత్తం: (20 ఓవర్లలో 5 వికెట్లకు 192); వికెట్ల పతనం: 122, 264, 397, 499, 5136; బౌలింగ్: షబ్నిమ్ 40251; హేలీ మాథ్యూస్ 30341; నికోలా కేరీ 40361; అమేలియా కెర్ 40401; అమన్‌జ్యోత్ కౌర్ 40480; సంస్కృతి 1050

**ముంబయి ఇండియన్స్ ఇన్నింగ్స్......:** కమలిని (స్టంప్డ్) మూనీ (బి) రేణుక సింగ్ 13; హేలీ మ్యాథ్యూస్ (సి) డివైన్ (బి) గౌతమ్ 22; అమన్‌జ్యోత్ కౌర్ (సి) గార్డ్‌నర్ (బి) డివైన్ 40; హర్మన్‌ప్రీత్ కౌర్ నాటౌట్ 71; నికోలా కేరీ నాటౌట్ 38; ఎక్స్‌ట్రాలు 9 మొత్తం (19.2 ఓవర్లలో 3 వికెట్లకు) 193; వికెట్ల పతనం: 120, 237, 3109;

# లక్ష్యసేన్ శుభారంభం

ఇండియా ఓపెన్ ప్రపంచ టూర్ సూపర్ 750 టోర్నీలో భారత స్టార్ ఆటగాడు లక్ష్యసేన్ శుభారంభం చేశాడు.



మంగళవారం పురుషుల సింగిల్స్ తొలి రౌండ్లో లక్ష్యసేన్ 2112, 2115తో ఆయుష్ శెట్టిపై నెగ్గి ప్రిక్వార్టర్‌ఫైనల్లో అడుగుపెట్టాడు. మహిళల డబుల్స్‌లో గాయత్రి గోపీచంద్, ట్రీసా జాలీ జోడీ ముందంజ వేసింది. తొలి రౌండ్లో గాయత్రి ద్వయం 2115, 2111తో ఆర్నిచా, సుకిత (థాయ్‌లాండ్) జంటపై గెలుపొందింది. మహిళల సింగిల్స్ తొలి రౌండ్లో ఇంతానన్ రచనోక్ (థాయ్‌లాండ్) 2119, 2115తో రైకో గుంజి (జపాన్)ని ఓడించింది. పురుషుల డబుల్స్‌లో హరిహరన్, అర్జున్ జోడీ 2115, 2118తో ఆంగ్ సిన్, తియో యి (మలేసియా) జంటపై గెలిచి ప్రిక్వార్టర్స్ చేరుకుంది.

**అపరిశుభ్రం.. బ్లిక్‌ఫెల్డ్:** ఇండియా ఓపెన్‌కు ఆతిథ్యమిస్తున్న ఇందిర గాంధీ ఇండోర్ స్టేడియంపై డెన్మార్క్ క్రీడాకారిణి మియా బ్లిక్‌ఫెల్డ్ తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేసింది. ఇండోర్ స్టేడియంలోని పరిస్థితులు అపరిశుభ్రంగా ఉన్నాయని విమర్శించింది. వార్మప్ కోర్టుల్లో పక్షుల రెట్టలు ఉండటం.. తీవ్ర చలితో క్రీడాకారులు వింటర్ జాకెట్లు, గ్లోవ్స్ ధరించాల్సి రావడంపై ఆవేదన వ్యక్తంచేసింది. ఈ పరిస్థితులు గాయాలు, అనారోగ్యానికి దారితీసే ప్రమాదం ఉన్నందున బీడబ్ల్యూఎఫ్ జోక్యం చేసుకోవాలని కోరింది. ఆగస్టులో ఇక్కడ జరిగే ప్రపంచ ఛాంపియన్‌షిప్ వరకైనా సౌకర్యాలు మెరుగుపడాలని మిషెల్ లీ (కెనడా), ఇంతానన్ రచనోక్ (థాయ్‌లాండ్) ఆకాంక్షించారు.

# ట్రోల్స్ తాత్కాలికం.. పరుగులు.. వికెట్లే శాశ్వతం

–వచ్చే దశాబ్దం కూడా భారత్‌దే
–యువ ఆటగాళ్లు ఐపీఎల్ కంటే ముందు రెండేళ్లు దేశవాళీకి ఆడాలి
–అతి ప్రచారంతో ఆటగాళ్లపై మానసిక ఒత్తిడి
– సౌరభ్ గంగూలీ



భారత క్రికెట్లో సౌరభ్ గంగూలీది ఓ చిరస్మరణీయ ఇన్నింగ్స్. ఆటగాడిగా ఎంత బలమైన ముద్ర వేశాడో.. సారథిగా అంతకన్నా రెట్టింపు ప్రభావం చూపించాడు. పాలకుడిగానూ విలక్షణతను చాటుకున్నాడు. కానీ, విజయవంతమైన బ్యాటర్‌గా కన్నా, ఎన్నో విజయాలను అందించిన కెప్టెన్‌గా కన్నా.. భారత క్రికెట్ ఆలోచనా విధానాన్ని మార్చిన వ్యక్తిగానే గుర్తుండి పోవాలని కోరుకుంటున్నాడు గంగూలీ. టెస్టు క్రికెట్ మనుగడ, ఆటగాళ్లపై సోషల్ మీడియా ప్రభావం, దేశవాళీ క్రికెట్లో రావాల్సిన మార్పులు.. ఇలా ఎన్నో అంశాలపై తన ఆలోచనలను పంచుకున్నాడు దాదా. క్రికెట్లో వచ్చే దశాబ్దం కూడా భారత్‌దే అంటున్న గంగూలీ ప్రత్యేక ఇంటర్వ్యూలో ఎన్నో విషయాలు చెప్పాడు.

**బ్యాటర్‌గా, కెప్టెన్‌గా, ఆపై అడ్మినిస్ట్రేటర్‌గా మీ ప్రయాణం ఎలా సాగింది? విమర్శలను, ఒత్తిడిని మీరెలా అధిగమించారు?**

ప్రతి ప్రయాణంలో నిలకడ చాలా ముఖ్యం. కెరీర్ ఆరంభంలో వైఫల్యం... ఫిక్సింగ్ వివాదం సమయంలో సారథ్యం... కొవిడ్19 కాలంలో బీసీసీఐ అధ్యక్షుడిగా ఎన్నో సవాళ్లు ఎదుర్కొన్నా. బ్యాటర్‌గా ఆఫ్‌సైడ్ ఆటను మెరుగుపరుచుకున్నా. కెప్టెన్‌గా జట్టులో దూకుడు నింపా. విమర్శల గురించి నేను పెద్దగా పట్టించుకోను. ఆటపైనే నా దృష్టి ఉండేది. ఒత్తిడి ఉన్నప్పుడు కుటుంబంతో సమయం గడుపుతా.

**భారత క్రికెట్లో మీరెలా గుర్తుండాలని కోరుకుంటున్నారు?**

18,000 పైచిలుకు పరుగులు.. విజయాల కంటే భారత క్రికెట్ ఆలోచనా విధానాన్ని, దృక్పథాన్ని, భారత ముఖచిత్రాన్ని మార్చిన వ్యక్తిగా ఎప్పటికీ గుర్తుండిపోవాలని ఉంది. 2000 సంవత్సరం కంటే ముందు భారత ఆటగాళ్లపై మరీ నెమ్మదస్థులనే ముద్ర ఉండేది. దాన్ని మార్చి దూకుడు తీసుకొచ్చా. భయంలేని పోరాటతత్వాన్ని నేర్పించా. లార్డ్స్‌లో చొక్కా విప్పి చేసిన సంబరాలు ఆ ఆత్మవిశ్వాసానికి ప్రతీక. హర్భజన్, జహీర్, సెహ్వాగ్, యువరాజ్, మహ్మద్ కైఫ్ వంటి ప్రతిభావంతులను ప్రోత్సహించా. బీసీసీఐ అధ్యక్షుడిగా మహిళా క్రికెట్ అభివృద్ధి, ఆటగాళ్ల సంక్షేమం కోసం చేసిన కృషి నాకు సంతృప్తినిచ్చాయి.

**వచ్చే దశాబ్ద కాలంలో ప్రపంచ క్రికెట్లో భారత్ పాత్రను.. వివిధ ఫార్మాట్లలో మన ఆధిపత్యాన్ని మీరెలా చూస్తారు?**

ఆర్థికంగా, ఆటపరంగా ప్రపంచ క్రికెట్‌లో భారత్ ఎప్పుడూ అగ్రగామిగానే ఉంటుంది. మన దేశవాళీ వ్యవస్థ, ప్రతిభావంతులైన ఆటగాళ్ల లభ్యతతోనే సచిన్ తెందూల్కర్, రాహుల్ ద్రవిడ్ వంటి దిగ్గజాల నుంచి విరాట్ కోహ్లి, రోహిత్‌శర్మ వరకు.. ఇప్పుడు శుభ్‌మన్ గిల్, యశస్వి జైస్వాల్ లాంటి యువ కెరటాల దాకా మార్పు చాలా సాఫీగా సాగింది. ద్వైపాక్షిక సిరీస్‌లలో.. ముఖ్యంగా ఆస్ట్రేలియా (201819) వంటి విదేశీ గడ్డపై మన విజయాల పరంపర కొనసాగుతోంది. ఐపీఎల్ ద్వారా టీ20లో కొత్త ఆవిష్కరణలు వస్తున్నా.. టెస్టు క్రికెట్ మనుగడను కాపాడటం అందరి బాధ్యత. భారత్‌లో ప్రతిభకు కొదవలేదు. అది ఏ ఫార్మాట్‌లోనైనా కనిపిస్తుంది. క్రికెట్లో వచ్చే దశాబ్దం కూడా భారత్‌దే.

**భారత్‌లో క్రికెట్‌ను సమర్థవంతంగా నిర్వహించడానికి క్రికెట్ పాలకులకు కావాల్సిన లక్షణాలేంటి?**

ఆటగాళ్లపై సానుభూతి, విజన్ ఉండటం మొదటిది. క్రికెటర్ల అవసరాలను అర్థం చేసుకోవాలి. వారి సంక్షేమం, దేశవాళీ కాంట్రాక్టులు, ఫిట్‌నెస్ ప్రమాణాలు, మహిళా క్రికెట్ అభివృద్ధిపై దృష్టి సారించాలి. నిర్ణయాత్మక నాయకత్వం రెండోది. ఒత్తిడిలోనూ, వివాదాల మధ్యలో కూడా కఠిన నిర్ణయాలు తీసుకోగలగాలి. డేనైట్ టెస్టులు, కోచ్‌ల నియామకం వంటి విషయాల్లో వెనకడుగు వేయకూడదు. క్రీడా పరిజ్ఞానం, క్షేత్రస్థాయి నిబద్ధత ఉండటం మూడోది. ఆటపై పట్టు ఉండాలి. స్వల్పకాలిక ప్రయోజనాల కంటే ప్రతిభ గుర్తింపు, దేశవాళీ వ్యవస్థకు ప్రాధాన్యతనివ్వాలి.

**ఐపీఎల్ ప్రభావం సుదీర్ఘ ఫార్మాట్‌లైన టెస్టులు, రంజీ ట్రోఫీ మ్యాచ్‌లపై పడకుండా ఉండాలంటే ఏం చేయాలి?**

ఐపీఎల్‌తో ఆటగాళ్లలో ఆత్మవిశ్వాసం పెరుగుతుందనడంలో సందేహం లేదు. కానీ అది అన్ని ఫార్మాట్లకు ఊతమిచ్చేలా ఉండాలి. యువ ఆటగాళ్లు ఐపీఎల్‌లోకి రావడానికి ముందు తప్పనిసరిగా కనీసం రెండేళ్లు రంజీ క్రికెట్ ఆడాలనే నిబంధన తేవాలి. ఐపీఎల్ ఆదాయాన్ని దేశవాళీ క్రికెట్‌కు, మౌలిక సదుపాయాలకు మళ్లించాలి. టెస్టు మ్యాచ్‌లకు ఐపీఎల్ షెడ్యూల్‌తో ఇబ్బంది లేకుండా చూడాలి.

**కెరీర్ ఆరంభంలోనే పెద్ద విజయం సాధించినప్పుడు ఆటగాళ్లు ఎదుర్కొనే సవాళ్లు ఏమిటి? వాటిని ఎలా అధిగమించాలి?**

తొందరగా వచ్చే విజయంతో అహంకారం పెరిగి, అలసత్వం వచ్చే ప్రమాదముంది. భారీ ఒప్పందాలు, ప్రకటనలతో ఫిట్‌నెస్, ప్రాథమిక అంశాలను నిర్లక్ష్యం చేసే అవకాశం లేకపోలేదు. అతిగా ప్రచారం లభిస్తే మానసిక ఒత్తిడికి లోనవుతారు. నేను కూడా తొలి పర్యటన తర్వాత జట్టులో స్థానం కోల్పోయా. 1996లో తిరిగి జట్టులోకి రావడానికి ఎంతో కష్టపడ్డా.

**మీరు ఆడినప్పటితో పోలిస్తే నేటి సోషల్ మీడియా యుగంలో ఆటగాళ్లపై నిఘా ఎలా ఉంది?**

మా కాలంలో పత్రికలు, టీవీ ఛానెళ్లు మాత్రమే ఉండేవి. నా అరంగేట్రం వైఫల్యం సమయంలో తీవ్ర విమర్శలు వచ్చాయి. టీవీ కట్టేస్తే, పత్రిక చదవడం మానేస్తే ఆ ఒత్తిడి తెలిసేది కాదు. కానీ నేటి ఆటగాళ్లపై 24 గంటల నిఘా ఉంది. సోషల్ మీడియాలో నోటిఫికేషన్లు, వైరల్ వీడియోలు ప్రతి వైఫల్యాన్ని ఎత్తి చూపుతాయి. ఇది ఆటగాళ్లనే కాకుండా వారి కుటుంబ సభ్యులనూ లక్ష్యం చేసుకుంటుంది. మరోవైపు సోషల్ మీడియా హైప్ కారణంగా ఆటగాళ్లలో అసహనమూ పెరుగుతోంది. ఐపీఎల్ వైరల్ వీడియోలతో అనవసర పోలికలు వస్తున్నాయి. భారత జట్టుకు ఆడాలన్న లక్ష్యం ఉండాల్సిందే. కానీ దేశవాళీ క్రికెట్లో కష్టపడి మెరుగవ్వాలన్న సహనం కూడా అవసరం.

**సోషల్ మీడియా ఒత్తిడిని, నెగెటివిటీని యువ ఆటగాళ్లు ఎలా అధిగమించాలి?**

సోషల్ మీడియాలోని గోలను పట్టించుకోవద్దు. సోషల్ మీడియాకు దూరంగా ఉండి ఆటపైనే దృష్టి సారించాలి. భారతీయులు మానసిక దృఢత్వం కలిగిన వాళ్లని నిరూపించుకోవాలి. కనీసం రెండేళ్లు దేశవాళీ క్రికెట్లో కష్టపడాలి. కుటుంబం, మార్గనిర్దేశకుల సలహాలు తీసుకోవాలి. ట్రోల్స్ తాత్కాలికం.. సాధించే పరుగులు, తీసే వికెట్లే శాశ్వతం.

**అంతర్జాతీయ క్రికెట్ కోసం ఆటగాళ్లను సిద్ధం చేయడానికి దేశవాళీ వ్యవస్థలో ఎలాంటి మార్పులు సూచిస్తారు?**

ఫిట్‌నెస్‌ను తప్పనిసరి చేయాలి. ఆధునిక విశ్లేషణల ద్వారా సాంకేతికతను మెరుగుపరచాలి. విజువలైజేషన్ ద్వారా మానసిక దృఢత్వాన్ని పెంపొందించాలి. యువ ఆటగాళ్లు రంజీ ట్రోఫీకి ప్రాధాన్యం ఇవ్వాలి. బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌లో మెరుగైన శిక్షణ ఇప్పించాలి. చిన్న వయసులోనే విదేశీ పర్యటనలు చేస్తే వారు అంతర్జాతీయ స్థాయికి సిద్ధమవుతారు. జిల్లాస్థాయిలో బలమైన అకాడమీలు, వయోపరిమితి టోర్నీల ద్వారా ప్రతిభను గుర్తించాలి. రాష్ట్రస్థాయిలో ప్రతిభకే పట్టం కట్టాలి. రంజీ ట్రోఫీ అనుభవాన్ని తప్పనిసరి చేయాలి. జాతీయ స్థాయిలో డేటా, ఫిట్‌నెస్, మానసిక దృఢత్వ పరీక్షల ఆధారంగా పారదర్శకమైన ఎంపిక ప్రక్రియ ఉండాలి.

# రాజ్‌కోట్‌లోనే కొట్టేయాలని..



–న్యూజిలాండ్‌తో భారత్ రెండో వన్డే నేడు
మధ్యాహ్నం 1.30 నుంచి

జోరుమీదున్న టీమ్‌ఇండియా ఇంకో సమరానికి సై అంటోంది. మరో మ్యాచ్ మిగిలి ఉండగానే సిరీస్‌ను చేజిక్కించుకోవాలని అనుకుంటున్న ఆతిథ్య జట్టు.. రెండో వన్డేలో నేడు న్యూజిలాండ్‌ను ఢీకొట్టనుంది. గాయాలు వేధిస్తున్నప్పటికీ ఆటగాళ్ల ఫామ్ భారత్‌కు ఉత్సాహాన్నిస్తోంది. మరి ఆ జట్టు రాజ్‌కోట్‌లోనే సిరీస్ ఫలితాన్ని తేల్చేస్తుందా లేదా కివీస్ పుంజుకుంటుందా? ఆసక్తికర పోరు ఖాయం.

**సిరీస్‌పై కన్నేసిన టీమ్‌ఇండియా..** బుధవారం జరిగే రెండో వన్డేలో న్యూజిలాండ్‌ను ఢీకొట్టనుంది. వడోదరలో జరిగిన తొలి మ్యాచ్‌లో భారత్ నాలుగు వికెట్ల తేడాతో గెలిచిన సంగతి తెలిసిందే. అయితే వాషింగ్టన్ సుందర్ గాయం కారణంగా సిరీస్‌కు దూరమయ్యాడు. సెలక్టర్లు అతడి స్థానంలో ఆయుష్ బదోనిని జట్టుకు ఎంపిక చేశారు. వికెట్‌కీపర్ బ్యాటర్ రిషబ్ పంత్ తొలి మ్యాచ్‌కు ముందే గాయం వల్ల సిరీస్ నుంచి వైదొలగిన సంగతి తెలిసిందే. టీ20 ప్రపంచ కప్‌నకు నెల కన్నా తక్కువ రోజులే ఉన్న నేపథ్యంలో మరిన్ని గాయాలు కావొద్దని టీమ్‌ఇండియా కోరుకుంటోంది

**రెట్టించిన ఉత్సాహంతో..:** ఆటగాళ్ల గాయాలు ప్రతికూలాంశమే అయినప్పటికీ రాజ్‌కోట్‌లో టీమ్‌ఇండియా ఉత్సాహంగా బరిలోకి దిగుతోంది. ముఖ్యంగా విరాట్ కోహ్లి సూపర్ ఫామ్ జట్టుకు గొప్ప సానుకూలాంశం. జోరుమీదున్న కోహ్లి తొలి వన్డేలో 91 బంతుల్లోనే 93 పరుగులు చేసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించిన సంగతి తెలిసిందే. ఎలాంటి ఒత్తిడి లేకుండా సాధికారికంగా బ్యాటింగ్ చేస్తోన్న అతడు.. ఒకప్పటి కోహ్లిని తలపిస్తున్నాడు. అతడు మరోసారి సత్తా చాటాలని జట్టు ఆశిస్తోంది. కోహ్లితో పాటు కెరీర్ చరమాంకంలో ఉన్న రోహిత్ శర్మ కూడా ఆటను ఆస్వాదిస్తున్నాడు. వడోదరలో ఎక్కువసేపు నిలవకున్నా అతడు మంచి లయతో కనిపించాడు. కెప్టెన్ శుభ్‌మన్ గిల్, శ్రేయస్ అయ్యర్, రాహుల్ కూడా గత మ్యాచ్‌లో రాణించారు. ఈ బ్యాటర్ల ఫామ్‌తో భారత జట్టు బ్యాటింగ్ బలంగా కనిపిస్తోంది. అయితే గాయపడ్డ సుందర్ స్థానంలో ఎవరిని తుది జట్టులోకి తీసుకుంటారన్నది ఆసక్తికరం. ఆ స్థానం కోసం బదోని, నితీశ్‌ల మధ్య పోటీ ఉంది. నితీశ్‌కే అవకాశాలు మెండు. ఇక బౌలింగ్‌లో భారత్ మెరుగుపడాల్సివుంది. ముఖ్యంగా పేసర్లు హర్షిత్ రాణా, ప్రసిద్ధ్‌కృష్ణ పొదుపుగా బౌలింగ్ చేయాల్సిన అవసరం ఉంది. తొలి మ్యాచ్‌లో వీళ్లు ఆరుకు పైగా ఎకానమీ రేట్‌తో పరుగులిచ్చారు. స్పిన్నర్లు కుల్‌దీప్, జడేజా మరింత ప్రభావవంతంగా బౌలింగ్ చేయడం జట్టుకు అవసరం.

**న్యూజిలాండ్ పుంజుకునేనా..!.....:** ఓడినప్పటికీ తొలి మ్యాచ్‌ను ఆఖరి వరకు తీసుకెళ్లడం న్యూజిలాండ్‌కు ఆత్మవిశ్వాసాన్నిచ్చే విషయమే. మిచెల్, కాన్వే, నికోల్స్‌ల ఫామ్ ఆ జట్టుకు సానుకూలాంశం. తొలి మ్యాచ్‌లో వీళ్లు అర్ధశతకాలతో సత్తా చాటారు. యంగ్, ఫిలిప్స్, కెప్టెన్ బ్రాస్‌వెల్ కూడా పరుగుల బాట పట్టాలని కివీస్ కోరుకుంటోంది. మరోవైపు జేమీసన్ బంతితో సూపర్‌గా రాణించాడు. అతడిపై ఆ జట్టు మరోసారి ఆశలు పెట్టుకుంది. అయితే గత మ్యాచ్‌లో తేలిపోయిన మిగతా బౌలర్ల నుంచి అతడికి ఎంతమేర సహకారం అందుతుందన్నదానిపైనే రెండో వన్డేలో న్యూజిలాండ్ అవకాశాలు ఉన్నాయి.

**తుది జట్లు (అంచనా)...** భారత్: గిల్, రోహిత్, కోహ్లి, శ్రేయస్, రాహుల్, నితీశ్ కుమార్ రెడ్డి/ఆయుష్ బదోని, జడేజా, హర్షిత్ రాణా, కుల్‌దీప్ యాదవ్, అర్ష్‌దీప్ సింగ్, సిరాజ్;

**న్యూజిలాండ్........:** కాన్వే, నికోల్స్, విల్ యంగ్, డరెల్ మిచెల్, మిచెల్ హే, గ్లెన్ ఫిలిప్స్, బ్రాస్‌వెల్, క్రిస్టియన్ క్లార్క్, జేమీసన్, ఫౌక్స్, జేడెన్ లెనాక్స్.

**––పిచ్ ఎలా ఉందంటే..**రాజ్‌కోట్‌లో పిచ్ పూర్తిగా బ్యాటింగ్‌కు అనుకూలించనుంది. సాధారణంగా ఇక్కడ భారీ స్కోర్లు నమోదవుతుంటాయి. రెండో వన్డేలో తొలి మ్యాచ్‌లో కన్నా ఎక్కువ పరుగులు వచ్చినా ఆశ్చర్యపోనక్కర్లేదు. ఇక్కడ జరిగిన నాలుగు మ్యాచ్‌ల్లోనూ మొదట బ్యాటింగ్ చేసిన జట్టే గెలిచింది. అందులో మూడుసార్లు మొదట బరిలోకి దిగిన జట్టు 300పై స్కోరు చేసింది. చివరగా ఇక్కడ జరిగిన మ్యాచ్‌లో ఆస్ట్రేలియా 352 పరుగులు చేసింది. భారత్‌ను 66 పరుగుల తేడాతో ఓడించింది. రెండో ఇన్నింగ్స్ సమయంలో మంచు ప్రభావం ఉంటుంది.



# కోచ్‌లకూ టాప్స్

## గోపీచంద్ కమిటీ సిఫార్సు

భారత క్రీడారంగంలో శిక్షకుల ప్రమాణాలను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లేందుకు జాతీయ బ్యాడ్మింటన్ చీఫ్ కోచ్ పుల్లెల గోపీచంద్ నేతృత్వంలోని టాస్క్ ఫోర్స్ కీలక ప్రతిపాదనలు చేసింది. ప్రతిభావంతులైన క్రీడాకారుల కోసం అమలు చేస్తున్న 'టార్గెట్ ఒలింపిక్ పోడియం స్కీమ్' (టాప్స్) తరహాలోనే.. శిక్షకులకు కూడా 'కోచ్ టాప్స్' పథకాన్ని ప్రవేశపెట్టాలని సిఫార్సు చేసింది. ఈమేరకు 43 పేజీల సమగ్ర నివేదికను కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖకు సమర్పించగా.. ఈ సూచనల్ని అమలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. దేశంలో కోచ్‌ల పురోగతి క్రమబద్ధంగా, అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా చూడటానికి జాతీయ కోచ్ అక్రిడిటేషన్ బోర్డు (ఎన్‌సీఏబీ) ఏర్పాటు అవసరమని గోపీచంద్ కమిటీ అభిప్రాయపడింది. ఈ బోర్డు భారత శిక్షణ వ్యవస్థకు కేంద్ర నాడీ వ్యవస్థలా పనిచేస్తూ.. జవాబుదారీతనాన్ని పర్యవేక్షిస్తుందని పేర్కొంది. ఈ బోర్డులో భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) అధ్యక్షుడు, క్రీడా శాఖ కార్యదర్శి, జాతీయ స్థాయి ప్రముఖులు, విద్యావేత్తలు సభ్యులుగా ఉంటారు. ప్రస్తుతం పటియాలాలోని ఎన్‌ఐఎస్‌లో అందుబాటులో ఉన్న డిప్లొమా కోర్సుల స్థానంలో కొత్త విధానాన్ని ప్రతిపాదించారు. క్షేత్రస్థాయి, మధ్య, ఎలైట్, జాతీయ జట్టు కోచ్‌లుగా వివిధ దశల్ని సూచించింది. మాజీ క్రీడాకారులు, పీఈటీలు, స్పోర్ట్స్ సైన్స్ గ్రాడ్యుయేట్లు శిక్షణ రంగంలోకి వచ్చేలా వెసులుబాటు కల్పించింది. ప్రతి క్రీడలో ఏడాదికి అయిదుగురు అత్యుత్తమ శిక్షకులను గుర్తించి 'కోచ్ టాప్స్' పథకం కింద వారికి అభివృద్ధి నిధులు కేటాయించాలని పేర్కొంది. క్రీడాకారుల మాదిరిగానే కోచ్‌లకు కూడా నిర్ణీత మైలురాళ్ల ఆధారంగా నిధులు విడుదల చేయాలని గోపీచంద్ కమిటీ ప్రతిపాదించింది.